
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య జిల్లా వార్తలు
5
గురువారం 9 జనవరి 2025

ఇసుక తరలించేస్తున్నారు..



- నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వకాలు
- ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లతో సరఫరా
- పేరుకే ఉచితం.. అధిక ధరకు విక్రయం

జిల్లాలో ఇసుకను కొందరు అక్రమంగా తరలించేస్తున్నారు. ప్రజల అవసరాలకు యంత్రాలతో లోడు చేయకుండా కూలీలతో చేయించాలనే నిబంధనలకు విరుద్ధంగా పట్టపగలే ఎక్స్‌కవేటర్‌లతో తోడేస్తూ అడ్డూఅదుపు లేకుండా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు ఇసుక ఉచితమని చెబుతున్నా ప్రజలకు మాత్రం దొరకడం లేదు. అధిక ధర చెల్లించి కొనాల్సి వస్తోంది. కొందరు దీనినే ఆదాయ మార్గంగా మార్చుకుని.. రెండు చేతులా సంపాదిస్తున్నారు.



వాల్మీకిపురం మండలం సాకిరేవుపల్లె సమీపంలో ఇసుక అక్రమ డంపింగ్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు గ్రామం సమీపంలో ఉన్న మాండవ్యా నది నుంచి ప్రతిరోజూ ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పట్టణంలో రోజూ భవన నిర్మాణాలు జరుగుతుండడంతో ఇక్కడ ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో పలువురు అక్రమార్కులు ప్రతిరోజూ యథేచ్ఛగా ట్రాక్టర్లతో ఇసుకను పట్టణానికి తరలిస్తున్నారు. చిన్నమండెం, వీరబల్లి మండలం గుండా వెళుతున్న మాండవ్యా నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. చిన్నమండెం మండలంలో గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాలో చక్రం తిప్పిన వాళ్లే ఇప్పుడు కూడా ఇసుక తరలిస్తుండడం విశేషం. ప్రభుత్వం ఒకవైపు ఇసుక ఉచితమని చెబుతున్నప్పటికీ ఇక్కడ మాత్రం అక్రమార్కుల అడ్డదారుల్లో ఇసుకను తరలించి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లె మీదుగా మదనపల్లెకు ఇసుక అక్రమ రవాణా

- సుండుపల్లెలోని బాహుదా నదిలో 10, 15 చోట్ల నుంచి ఇసుక అక్రమ తరలింపు జరుగుతోంది. రాయచోటి, పీలేరు, కేవీ పల్లె, వీరబల్లి తదితర ప్రాంతాలకు అక్రమంగా రవాణా జరుగుతోంది. ఈ దందాలో అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష వైసీపీ నాయకులు కూడా ఉండడం విశేషం.
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న వాగులు, వంకల నుంచి ఇసుక తోలి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా వాగులు, వంకల్లో నీళ్లు ఉండడంతో ఎక్స్‌కవేటర్‌ల సాయంతో ఒడ్డుకు వేసి తర్వాత ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.
- పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపమో? లేక లోపాయికారి సహకారమో? తెలియదుగానీ ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. రోజూ తెల్లవారుజామున 4 గంటలకు మొదలయ్యే ఇసుక అక్రమ రవాణా పట్టణంలోని బైపాస్ రోడ్డు గుండా జోరుగా సాగుతున్నా అడిగే వారే లేరు. అక్రమ రవాణాపై నిఘా పెట్టాల్సిన అధికారులు కూడా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. రాత్రి సమయాలలో కొందరు గస్తీ పోలీసులు ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకోకపోగా లాలూచీపడి వదిలేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. మండల వ్యాప్తంగా బాహుదా కాలువ ప్రాంతాన్ని ఇప్పటికే ఇసుక మాఫియా గుల్ల చేసేసింది. మండలంలోని టి.సాకిరేవుపల్లె, బూడిదవేడు తదితర ప్రాంతాలలో డంపింగ్ చేయడం, రాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా బయటి ప్రాంతాలకు తరలించి ఇసుక మాఫియా సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమాలపై ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదన్నది గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కూరపర్తి, చింతపర్తి, మాదవ రం పల్లె, భోగంపల్లె రిజర్వాయర్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా పట్ల ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ అక్రమ దందా వెనుక మండలంలోని కొందరు టీడీపీ చోటామోటా నాయకుల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి.
- గుర్రంకొండ మండలంలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో కొందరు అధికార పార్టీ నాయకులు తరిగొండ రామానాయుడు చెరువు, మర్రిపాడు హరిహరాదుల చెరువులో ఇసుకను ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. అక్రమ రవాణాదారులకు రెవెన్యూ, పోలీసు శాఖలోని కొందరు అధికారులతో సత్సంబంధాలు ఉండడంతో అక్రమ ఇసుక రవాణాకు ఎటువంటి అడ్డంకులూ లేవు.
- కలికిరి మండలంలోని మేడికుర్తి, చీకటిపల్లె, మహల్, గుండ్లూరు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న బాహుదానది పరీవాహక ప్రాంతం నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. కలికిరి పట్టణంలో ఒక ట్రాక్టరు ఇసుకను రూ.1500 నుంచి రూ.1700లకు విక్రయిస్తున్నారు. అదే ఇసుకను పీలేరు పట్టణంలో రూ.2500 నుంచి రూ.3 వేల వరకు అమ్ముకుంటున్నారు. పలు గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఇసుక అక్రమంగా తరలిస్తుండడం విశేషం.

అధికారుల్లో మార్పు రాదా..!



అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కేంద్ర కరువు బృందం అధికారి పెరిన్‌దేవి

- రాయలసీమ రాళ్ల సీమగానే ఉండాలా..
- అధికారులను ప్రశ్నించిన కరువు బృందం చీఫ్ పెరిన్‌దేవి
- కరువుపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన
- కరువు నివారణకు ప్రత్యామ్నాయ చర్యలే లేవని వ్యాఖ్య

బి.కొత్తకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికారుల్లో మార్పు రాదా... ఎప్పుడూ కరు వు.. కరువు అనడం తప్ప ఆ కరువు నుంచి రైతులను గట్టెక్కించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించరా.. అని కేంద్ర కరువు బృందం అధికారి పెరిన్‌దేవి అధికారులను ప్రశ్నించారు. రాయలసీమను ఇంకా ఎంతకాలం రాళ్ల సీమగానే పెడతారు... రైతులకు సలహాలిచ్చి మార్పు తీసుకురావాల్సింది మీరే కదా...మీరే మారకపోతే వారిని ఎలా మార్చుతారు...అంటూ ప్రశ్నించారు. బి.కొత్తకోట మండలంలోని తుమ్మణంగుట్ట సచివాలయంలో ఈ ఆసక్తికర ఘటన జరిగింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పం టనష్టాన్ని అంచనా వేసేందుకు బుధవారం కేంద్ర కరువు బృందం వచ్చింది. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్‌దేవి నేతృత్వంలో పీఏఎఫ్సీ డిప్యూటీ డైరెక్టర్ సుప్రియామాలిక్, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనూరాధాబటానా, కేంద్ర తాగునీరు, పారిశుధ్య అదనపు సలహాదారు ఆశిష్‌పాండేలతో కూడిన కరువు బృందం జిల్లాలో పర్యటించింది. మంగళవారం రాత్రి హార్సిలీహిల్స్‌లో విడిది చేసిన కేంద్ర బృందం బుధవారం ఉదయం పొలాలకు వెళ్లకుండా నేరుగా మండలంలోని తుమ్మణంగుట్ట పంచాయతీ సచివాలయం వద్దకు చేరుకుంది. కార్యాలయ ఆవరణలో వ్యవసాయ, పశు సంవర్ధక, నీటి పారుదల శాఖలతో పాటు డ్వామా అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌లతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, డ్వామా పీడీ వెంకటరత్నం తదితరులు తమ శాఖలకు సంబంధించిన ఫొటోలను చూపుతూ వివరించారు. అధికారులు చూపింది చూసి, చెప్పింది విని తలాడించకుండా గత పదేళ్ల డేటా తమ వద్ద ఉందని, ప్రతి ఏడాది ఇలాంటి ఫొటోలే చూపిస్తున్నారని, మార్పునకు ఏమీ ప్రయత్నాలు చేయరా, కరువు నుంచి రైతులను గట్టెక్కించే ప్రత్యామ్నాయ మార్గాలే లేవా అంటూ నిలదీశారు. అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై అయినా మారాలని, రాయలసీమలో మార్పు తీసుకురావాలని సూచించారు. అనంతరం సచివాలయంలో రైతులతో మాట్లాడారు. వేరుశనగ పంట సాగుకైన ఖర్చు, వచ్చిన నష్టంపై రైతులు రామలక్ష్మమ్మ, వెంకటరమణ కరువు బృందానికి వివరించారు. ఎప్పుడూ నష్టం తెచ్చిపెట్టే వేరుశనగ పంటవైపు కాకుండా ఇతర మార్గాలను అన్వేషించాలని ఆమె రైతులకు సూచించారు. వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకం వర్తింపజేయాలని గోపాల్‌రెడ్డి, పాడి రైతులను ఆదుకునే విధంగా పశువుల దాణాకు రాయితీలు ఇవ్వాలని మరో రైతు శీతారామిరెడ్డి కరువు బృందాన్ని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకట్రామయ్య, వెటర్నరీ ఎస్ఈ పిళ్లైలతో పాటు, తహసీల్దార్ మహమ్మద్‌అన్సారీ, ఎంపీడీవో శంకరయ్య, ఏపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణతంత్ర ఉత్సవాలకు మైసూరివారిపల్లె సర్పంచ్

- కారుమంచి సంయుక్తకు ఢిల్లీ నుంచి ఆహ్వానం



కారుమంచి సంయుక్త, సర్పంచ్

రైల్వేకోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యో తి): ఢిల్లీలో ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర ఉత్సవాలకు రైల్వేకోడూరు మండలంలోని జనసేన పార్టీ మద్దతు మైసూరివారిపల్లె మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్తకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపిం ది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకు మైసూరివారిపల్లె పంచాయతీని క్లీన్‌అండ్ గ్రీన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ మైసూరివారిపల్లె పంచాయతీ క్లీన్‌అండ్‌గ్రీన్‌లో ఎంపికైందని, ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర ఉత్సవాలకు ఆహ్వానం పంపారని తెలిపారు. తాను 24న ఢిల్లీకి వెళతానని తెలిపారు.



మైసూరివారిపల్లె గ్రామం

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రమణ్యం

సంబేపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. సంగ్రహణాత్మక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించాలన్నారు. డీ గ్రూపులోని విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక అనుసరించాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులు రుక్సానా, మౌనిక, తరుణ్‌కుమార్‌గౌడ్‌లకు మెమెంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, ఏకలవ్య పాఠశాల కో-ఆర్డినేటర్ రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు మదనపల్లె విద్యార్థినులు

మదనపల్లె టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ యువజనోత్సవాలకు అన్నమయ్య జిల్లా నుంచి జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినుల బృందం పాల్గొననున్నట్లు యువజన సర్వీసుల శాఖ సీఈవో సి.సాయిగ్రేస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు 29వ తేదీ నిర్వహించిన జిల్లా యువజనోత్సవాల్లో జానపద నృత్యంలో జ్ఞానాంబిక విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 11, 12 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించే జాతీ య యువజనోత్సవాల్లో ఈ బృందం పాల్గొననుందన్నారు. ఢిల్లీకి వెళ్లే బృందంలో సాయి మేఘన, కీర్తన, మానస, భువనేశ్వ రి, లక్ష్మీశ్రీ, గిరిజ, హర్షిణి, అని త, లావణ్య, మైథిలి ఉన్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు.



జాతీయ యువజనోత్సవాలకు ఎంపికైన జ్ఞానాంబిక విద్యార్థినులు

మోదీకి బ్రహ్మారథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

రూ.11.83 కోట్లతో ప్రతిపాదనలు

- కేంద్ర బృందానికి నివేదించిన కలెక్టర్ ● 19 మండలాల్లో దుర్భిక్షం



కేంద్ర బృందానికి కరువు పరిస్థితిని వివరిస్తున్న కలెక్టర్

మదనపల్లెటౌన్/ వాల్మీకిపురం/ తంబళ్లపల్లె/ కురబలకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 30 మండలాలకు గాను 19 మండలాల్లో కరువు వలన దుర్భిక్షం ఏర్పడిందని, ఖరీఫ్‌లో పంట నష్టపరిహారానికి రూ.11.83 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ కేంద్ర కరువు పరిశీలన బృందానికి నివేదించారు. బుధవారం జిల్లాలోని బి.కొత్తకోట, తంబళ్లపల్లె, వాల్మీకిపురం మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందం మధ్యాహ్నానికి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇక్కడ కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందం లీడర్ పెరిన్‌దేవి, సభ్యులు సుప్రియ మాలిక్, అనురాధ బటనా, ఆశిశ్‌పాండేలకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ఖరీఫ్‌లో రైతులు 42 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారని వర్షాభావం వలన 60 శాతం పంట నష్టపోయారన్నారు. 10 వేల హెక్టర్లలో వరి పంట సాగు చేసినా చెరువుల్లో సరిపడా సాగునీరు లేక సరైన దిగుబడి రాలేదన్నారు. కేంద్రం పశుగ్రాసం సరఫరా చేస్తే పాడి రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా 19 మండలాల్లో తాగునీటి సమస్యలు రావడంతో ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేశామన్నారు. కరువు వలన ఎంతో మంది రైతులు ఊర్లు విడిచి వలసలు వెళ్లారని, ఉపాధి హామీ పథకంలో వలసవెళ్లిన ప్రజలను ఆదుకున్నామన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీపీవో చంద్రానాయక్, ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వాల్మీకిపురం మండలంలోని జర్రావారిపల్లెలో బుధవారం మధ్యాహ్నం కేంద్ర కరువు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కరువు పరిస్థితులపై ఫొటో ప్రదర్శనను పరిశీలించి స్థానిక స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ముఖాముఖిలో రైతులు పలు సమస్యలను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి గ్రామానికి సాగు, తాగునీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన కరువు బృందం అధికారులు పూర్తి సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయక చర్యలు చేపట్టేలా చూస్తామని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్ పామిలేటి, ఇతర జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపోయాం..ఆదుకోండి

కరువుతో పంటలు నష్టపోయాం.. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూసి తమను ఆదుకోవాలని కేంద్ర కరువు బృందం అధికారులకు రైతులు మొరపెట్టుకున్నారు. బుధవారం జిల్లా అధికారులతో కలిసి కేంద్ర కరువు బృందం అధికారులు తంబళ్లపల్లె మండలంలోని కోటకొండ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకుని పలు సలహాలు, సూచనలు చేశారు.నూనె గింజలు, టమోటా, వరి వంటి ఉత్పత్తులు రాయలసీమ ప్రాంతాల నుంచి దేశ స్థాయిలో సరఫరా అవుతున్నాయని అటువంటి ప్రాంతంలో 30 ఏళ్ల పాత రకాలైన కే6, నారాయణి, ధరణి వంటి వేరుశనగ విత్తన రకాలు పంపిణీ చేయడంపై అధికారులపై కేంద్ర బృందం అధికారి పెరిన్‌దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు హరికుమార్, ఏవో రమణకుమార్, ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, రైతులు, ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

కరువు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కరువు బృంద అధికారి పెరిన్‌దేవి తెలిపారు. బుధవారం కురబలకోట మండలంలోని మట్లివారిపల్లెలో కేంద్ర కరువు బృందం పర్యటించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో 'అన్నమయ్య' ప్రతిభ

- సౌత్ ఇండియాకు రెండు ప్రాజెక్టులు ఎంపిక



టీచర్స్ విభాగంలో శివనారాయణగౌడ్, విద్యార్థులు మహమ్మద్ సుహేల్, రెహాన్

రాయచోటి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థులు ప్రదర్శించిన రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 6 ప్రాజెక్టులను ప్రదర్శించగా రెండు ప్రాజెక్టులు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. ఇందులో టీచర్స్ విభాగం నుంచి చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివ నారాయణగౌడ్ రూపొందించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి కాపర్ కోటెడ్ బాటిల్ ప్రాజెక్టు, విద్యార్థుల గ్రూపులో కలకడ మోడల్ స్కూల్‌కు చెందిన మహమ్మద్ సుహేల్, రెహాన్‌లు రూపొందించిన బయో ఎంజైమ్స్ ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. గ్రూపు ప్రాజెక్టుకు సుమతి గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరాజు, ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి, విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ పురుషోత్తం వీరికి జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో నిర్వహించే దక్షిణ భారతదేశ సైన్స్ ప్రదర్శనలో వీరు పాల్గొననున్నారని తెలిపారు. విజేతలతో పాటు గైడ్ టీచర్లను డీఈవో సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బాలనాగేంద్ర, ప్రసాద్, ప్రిన్సిపాల్ మౌలామ్‌బాషా వలి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు లాభాలు

ఉద్యాన పంటలను పరిశీలించిన రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు



పీటీఎంలో జీవామృతం ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని మడుమూరు గ్రామం వద్ద కొండా నరేంద్ర ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో 70 ఎకరాల్లో సాగు చేసిన అవకాడో, నేరేడు, అరటి, మామిడి, మునగ, నిమ్మ, ఉసిరి తదితర పంటలను పరిశీలించారు. అనంతరం మద్దయ్యగారిపల్లె సమీపంలో ప్రభుత్వం రూ.65 లక్షలతో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీవో (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) కేంద్రాన్ని పరిశీలించారు. పెద్దతిప్పసముద్రం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం డ్రిప్ పరికరాల కోసం రూ.450 కోట్లు, ఉద్యాన పంటలకు మరో రూ.70 కోట్లు ఆయిల్‌పాం పంటల కోసం రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట డీఎంఐఏవో లక్ష్మీప్రసన్న, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు హార్టికల్చర్ అధికారి భీమేష్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్నతో కలిసి బుధవారం బి.కొత్తకోట మండలంలో హార్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. కోటావూరు గ్రామ సచివాలయంలో మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాల హార్టికల్చర్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని గుడిపల్లి పంచాయతీ పరిధిలో రైతు నగేష్ రూ.16 లక్షల రాయితీతో నిర్మించిన పాలీహౌస్‌లను సందర్శించి అందులో ఆధునిక పద్ధతిలో సాగు చేసిన రోజా పూల సాగును పరిశీలించి యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్‌పై రైతు నగేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విలేఖర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో 3 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ చేపట్టబోతున్నామన్నారు. రూ.3978 కోట్ల బడ్జెట్‌తో హార్టికల్చర్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కమిషనర్‌ను ఏపీఎంఐపీ ఎంఐ ఇంజనీర్ల సంఘం ప్రతినిధి హరి కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

ముక్కోటి ఏకాదశికి రామాలయంలో ఏర్పాట్లు



రామాలయం వద్ద క్యూ లైనును సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామాలయానికి పెద్దఎత్తున జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారనే ఉద్దేశ్యంతో ముందుగా టీటీడీ అధికారులు రామాలయం చుట్టూ ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశారు. అందుకోసం సిబ్బంది రామాలయం మాడవీధుల్లో ఎండవేడిని తట్టుకునేందుకు చలువ పందిళ్లతో పాటు క్యూలైన్లలో పైకప్పును ఏర్పాటు చేశారు. కోదండరామాలయ అభివృద్ధి పను లు జరుగుతున్నందున బాలాలయ పూజలు అందుకుంటున్న సీతారామ లక్ష్మణులు రామాలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కోదండరామాలయంలో భక్తులను ఆకట్టుకునే విధంగా బెంగళూరు నుంచి తీసుకువచ్చిన పూలతో రామాలయంలోని ధ్వజస్తంభం, రంగమండపంలో ప్రత్యేక పూలంకరణ చేపట్టనున్నారు. వీటితో పాటు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులకు పులిహోర, చక్కర పొంగలిని ప్రత్యేకంగా తయారు చేసి భక్తులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. టీడీపీ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి ముక్కోటికి 2 లక్షల రూపాయల నగదును పూల కోసం అందచేశారని నిర్వాహకులు ముమ్మడి నారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడులు తెలిపారు.

కూల్‌డ్రింక్ స్టాక్ పాయింట్‌లో పేలుడు



అగ్నిప్రమాదంలో కాలిపోయిన కూల్‌డ్రింక్స్ బాటిళ్లు, నెర్రెలు చీలిన గోడ

- రూ.40 లక్షలకు పైగా ఆస్తినష్టం

తంబళ్లపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్స్ స్టాకు పాయింట్‌లో భారీ పేలుడు సంభవించడంతో కూల్‌డ్రింక్స్‌తో పాటు వస్తు సామాగ్రి కాలిపోయి, భవనం పూర్తిగా దెబ్బతిని సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లిన ఘటన తంబళ్లపల్లెలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ చేలూరివాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు పురుషోత్తం కూల్‌డ్రింక్స్‌కు డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. దీంతో ఓ నూతన భవనం నిర్మించుకుని అందులో కూల్‌డ్రింక్స్ స్టాకు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో స్టాకు పాయింట్ పక్కనే ఉన్న ఇంట్లో పురుషోత్తం నిద్రిస్తుండగా ఉన్నట్లుండి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దీంతో తేరుకున్న పురుషోత్తం, కుటుంబసభ్యులు స్టాకు ఉన్న భవనం వద్దకు వెళ్లి చూడగా మంటలు చెలరేగుతున్నాయి. దీంతో హుటాహుటిన పురుషోత్తంతో పాటు గ్రామస్తులు తీవ్రంగా కృషి చేసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే అందులో స్టాకు ఉన్న సుమారు రూ.20 లక్షల విలువ చేసే కూల్‌డ్రింక్స్‌తో పాటు, వస్తు సామాగ్రి కాలిపోయి భవనం పూర్తిగా నెర్రెలు చీలి దెబ్బతింది. ఈ ప్రమాదంలో వస్తు, ఆస్థినష్టంతో కలిపి సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు యజమాని పురుషోత్తం తెలిపాడు. ప్రమాదానికి గల కారణం షార్ట్‌సర్క్యూటా.? లేక కూల్‌డ్రింక్స్‌లో ఉన్న గ్యాస్ లీకేజీ అయ్యి బాటిల్స్ పగలడంతోనా..? అన్నది తెలియాల్సి ఉంది. బుధవారం ఉదయం ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, వీఆర్వో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్ర మాదం జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రమాద స్థలాన్ని సందర్శించి విచా రం వ్యక్తం చేశారు. బాధితుడికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

మదనపల్లె టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోందని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ (ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిషన్) ఆధ్వర్యంలో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్‌చార్జీల పెంపు అవసరంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోందన్నారు. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే ఈఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. రాష్ట్రంలో ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ వార్షిక ఆదాయం, బడ్జెట్ తదితర అంశాల ఆధారంగా ఈఆర్‌సీ ప్రజలు, పారిశ్రామికవేత్తల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరిస్తోందన్నారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి, 10వ తేదీ కర్నూల్ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహిస్తారన్నారు. 10వ తేదీ నిర్వహించే సమావేశంలో పాల్గొనే ప్రజలు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుని వర్చువల్ సమావేశంలో వారి అభిప్రాయాలు తెలియజేయవచ్చని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈలు గోవిందరెడ్డి, సురేంద్రనాయక్, హరికుమార్, ఏఈ ఉత్తన్న, అజయ్‌బాబు, ప్రజలు, ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ క్లయిమ్‌లతో రీఫండ్ చేస్తే చిక్కులు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

మదనపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ క్లయిమ్‌లు సృష్టించి ఆదాయపు పన్ను రీఫండ్ పొందితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని ఆదాయపు పన్ను శాఖ తిరుపతి అడిషనల్ కమిషనర్ టి.వి.వంశీధర్ తెలిపారు. స్థానిక బేబీవెల్‌కమ్ హోమ్‌లో బుధవారం ఆదాయపు పన్ను చెల్లించే అసెసీలతో అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వంశీధర్ మాట్లాడుతూ ఇన్‌కంట్యాక్స్ అసెసీలు ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్సును అడ్వాన్సుగా చెల్లిస్తే, సెక్షన్ 234బి, 234సీ సెక్షన్ ప్రకారం వడ్డీ ఉండదని తెలిపారు. ఇన్‌కం ట్యాక్స్ నోటీసులు వచ్చే, వాటికి ఎలాంటి సమాధానం ఇవ్వాలి, అడ్వాన్సు ట్యాక్సు ప్రాముఖ్యత, ఏఐఎస్ పోర్టల్, వినియోగాన్ని వివరించారు. అలాగే స్థానిక ఆదాయపు పన్ను శాఖ అధికారి టి.మహ్మద్ ఫారూఖ్ మాట్లాడుతూ ఏఐఎస్ పోర్టల్ వినియోగం, ఫ్రాడులెంట్ రీఫండ్స్‌ను ఎలా అరికట్టాలో వివరించారు. వివాద్ సే విశ్వాస్-2024 పథకాన్ని గురించి ట్యాక్సు పేయర్స్‌కు అవగాహన కల్పించారు. అనంతరం ట్యాక్సు పేయర్స్ అడిగిన ప్రశ్నలు, వారు లెవనెత్తిన సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌కంట్యాక్సు ఇన్స్‌పెక్టర్ సూర్యబాబునాయక్, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యుడు ప్రసాద్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు మదనపల్లె విద్యార్థి



లోహిత్

మదనపల్లె టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు మదనపల్లెకు చెందిన లోహిత్ ఎంపికయ్యాడని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్‌పర్సన్లు అమృత, శ్రీదేవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న లోహిత్ 400 రిలే పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి సెలెక్టర్లను ఆకట్టుకున్నాడ టన్నారు. ఇందులో భాగంగా జాతీయస్థాయిలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే అండర్-14 అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ షెహనాజ్‌ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, పీఈటీలు మహమ్మద్, భానుప్రకాష్‌లు లోహిత్‌ను అభినందించారు.

ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖలు ప్రగతి సాధించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమం, ప్రజల ఆరోగ్య సంరక్షణ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల్లో చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ అధికారులు, సిబ్బందితో ఆయా శాఖల అంశాల్లో సాధించిన ప్రగతి, సాధించాలిన ప్రగతి, ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారు. అందుకు గల కారణాలు తదితరాల్లో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్స్, సీడీపీవోల పనితీరుపై సమీక్షించి లక్ష్యాల్లో వెనుకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకుని, తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని పిల్లల హాజరు వందశాతం ఉండేలా కృషి చేయాలన్నారు. కేంద్రానికి పిల్లలు రాకున్నా హాజరు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యఆరోగ్యశాఖకు సంబంధించి సమీక్షిస్తూ వివిధ అంశాల్లో శ్రద్ధ పెట్టి లక్ష సాధనకు కృషి చేయాలని మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొన్ని మండలాలు ప్రగతి సాధనలో బాగా పనిచేస్తున్నాయని, మిగిలిన మండలాలు వెనుకబడి ఉన్నాయని, ఇందుకు గల కారణాలను లోపాలను గుర్తించి సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఏఎన్‌ఎం తరచూ పాఠశాలలను సందర్శించి వైద్యసేవలు అందించాలన్నారు. జీరో శాతం ప్రగతి ఉన్న వారు మూడురోజుల లోపల ప్రగతి సాధించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో, ఐసీడీఎస్ పీడీ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ పరీక్షలంటే... కాసుల పంటే

- మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా రిమ్స్ వైద్యశాల
- రూ.80వేల నుంచి లక్ష వరకు నర్సింగ్ కళాశాలల నుంచి డబ్బు వసూళ్లు
- డబ్బుల కోసం బాహాటంగా గొడవపడిన సిబ్బంది
- గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో సమాధానాల స్లిప్పులు



మైక్రో జిరాక్స్ తీసిన సమాధానాల స్లిప్పులు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని పుట్లంపల్లె వద్దగల ప్రభుత్వ వైద్యకళాశాల (రిమ్స్) మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా మారింది. దాదాపు 8 నర్సింగ్ కళాశాలలకు సంబంధించి విద్యార్థులకు పరీక్షలను రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు కాపీయింగ్ పాల్పడేందుకు ప్రతి నర్సింగ్ కళాశాల వైద్య కళాశాలకు సుమారు రూ.80వేల నుంచి లక్ష రూపాయల వరకు డబ్బు సమర్పించినట్లు సమాచారం. దీంతో నర్సింగ్ విద్యార్థులు పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడేందుకు పూర్తిగా స్వేచ్ఛను ఇస్తూ వైద్య కళాశాల అధికారులు చూసీచూనడట్లు వ్యవహరిస్తున్నారు. పరీక్ష మొదలవగానే ప్రశ్నాపత్రాన్ని బయటకు పంపిస్తున్నారు. కాసేపటికి జవాబులను రాసుకువచ్చి విద్యార్థులకు చెబుతున్నారు. నర్సింగ్ పరీక్షలను వైద్య కళాశాలలోని గ్యాలరీ, డెమో హాల్‌లో నిర్వహిస్తున్నారు. అక్కడ కెమెరాలు పనిచేయవు, ఉండవు. నర్సింగ్ కళాశాలల నుంచి డబ్బు అందుకోవడంతో వైద్య కళాశాల అధికారులు మాస్ కాపీయింగ్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అదనపు వసూళ్లు

నర్సింగ్ కళాశాల నుంచి గుత్త మొత్తంలో డబ్బులు అందుతున్నా పరీక్ష సమయంలో విద్యార్థులకు మరింత సహాయ సహకారాలు అందిస్తామంటూ వైద్య కళాశాల సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యార్థుల వద్ద రూ.2వేల నుంచి రూ.4వేలు వసూళ్లు చేసి త్వరితగతిన సమాధానాలు చేరవేస్తున్నారు. జవాబులను మైక్రో జిరాక్స్ ద్వారా తెప్పించి విద్యార్థులకు అందిస్తున్నారు. ఇదంతా వైద్య కళాశాలలో బాహాటంగా జరుగుతున్నా మాకెందుకులే అన్నట్లు కొందరు సిబ్బంది ఉంటున్నారు.

డబ్బుల పంపకాల్లో గొడవ

నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, యాజమాన్యాలు ఇచ్చిన డబ్బుల పంపకంలో తేడాలు రావడంతో ఇద్దరు ప్రభుత్వ వైద్యకళాశాల సిబ్బంది 6వ తేదీ సోమవారం గొడవపడినట్లు సమాచారం. వైద్య కళాశాలకు చెందిన సీనియర్ అసిస్టెంట్, అటెండర్‌ల మధ్య ఈ గొడవ జరిగినట్లు తెలుస్తోంది. వైద్య కళాశాల అధికారులకు సైతం ఈ డబ్బుల పంపకాల్లో వాటా ఉండడంతో సదరు సంఘటన బయటకు రానీయకుండా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రీవెన్స్ సెల్‌లో సైతం ఫిర్యాదు

వైద్య కళాశాలలో కాపీయింగ్ జరుగుతుందని, డబ్బు వసూళ్లు చేస్తున్నారని కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎవరూ ఏమి చేయలేరన్న ధీమాతో ఇంతా జరుగుతోంది.

జిల్లా అధికారుల అలసత్వమా..

గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇలాంటి అక్రమాలకు అలవాటు పడిన సిబ్బంది కూటమి ప్రభుత్వంలో సైతం ఏమాత్రం భయం లేకుండా అందరికీ తెలిసేలా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. దీనిపై సాక్షాత్తు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వైద్యకళాశాలలో నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ స్పందిస్తూ పరీక్షల్లో ఇలాంటివి ఏమీ జరగలేదు. మేము నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఏడాది పీజీ ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసుకున్న విద్యార్థులకు లెటరల్ ఎంట్రీ విధానంలో ఏడాది పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. జాతీయ విద్యా విధానం-2020 అమలులో భాగంగా నూతనంగా ఏడాది పీజీ కోర్సు (2024-25 విద్యా సంవత్సరం) నోటిఫికేషన్ సందర్భంగా ఆయన తన ఛాంబర్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ఆచార్య ఏజీ దాము, డీన్‌లు ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య వై.సుబ్బరాయుడు, సీడీసీ డీఎన్ ఆచార్య రఘుబాబు, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మిప్రసాద్‌తో భేటి అయ్యారు. నోటిఫికేషన్ సంబంధించి వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైవీయూ పరిధిలోని అఫిలియేషన్ కలిగిన అనుబంధ కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చామన్నారు. హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కామర్స్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు కోసం వైవీయు.ఇడియు.ఇన్‌ను సంప్రదించాలని సూచించారు. వెబ్‌సైట్‌లో విశ్వవిద్యాలయంలో లభించే కోర్సులు, సీట్లు సంబంధిత నిబంధనల గల బ్రోచర్ ఉంటుందన్నారు. 21వ తేదీ విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో ప్రవేశాల కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఇజితెమా

- రెండో రోజు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు



ఇజితెమాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మకూరు కేంద్రంగా జరుగుతున్న ఉమూమి తబ్లీగీ ఇజితెమా కార్యక్రమం రెండో రోజైన బుధవారం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇజితెమా కార్యక్రమానికి మంగళవారం రాత్రికే వేలాది సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. దీంతో బుధవారం తెల్లవారు జాము నుంచే సామూహిక ప్రార్థనలు మొదలయ్యాయి. అలాగే ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి విచ్చేసిన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను బోధించారు. కాగా వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి ఏలోటు రానివ్వకుండా ఇజితెమా నిర్వహణ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ తదితర సదుపాయాలను సమకూర్చారు. అదేవిధంగా ఇజితెమాకు హాజరైన ముస్లిం లకు దాతలు స్వచ్ఛందంగా పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఇదిలావుంటే ఇజితెమా ప్రాంగణమంతా ఎక్కడా చూసినా సందడి వాతావరణం నెలకొంది.

ఇజితెమాను సందర్శించిన ప్రముఖులు : ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో జరుగుతున్న ఇజితెమా కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఇజితెమా ఏర్పాట్ల గురించి కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ పవిత్రమైన ఉమూమి తబ్లీగీ ఇజితెమా కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం శుభపరిణామమన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇజితెమాకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

11 నుంచి ట్రిపుల్‌ఐటీకి సెలవులు

వేంపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సెలవులు ఇచ్చారు. ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న కొందరు విద్యార్థులకు పూర్తి కాగా బుధవారం నుంచే ఇళ్లకు బయలుదేరారు. తిరిగి 20వ తేదీ ట్రిపుల్‌ఐటీ తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

భార్య, కూతురిని చంపిన నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎన్.వెంకట రమణ

పులివెందుల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం టి.తుమ్మలపల్లెలో ఈనెల 6వ తేదీ భార్య, కూతురిని చంపిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఎన్.వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తుమ్మల గంగాధరెడ్డి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ.. రోజూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. 6వ తేదీ రాత్రి 9గంటలకు మందు తాగి ఇంటికి వచ్చిన గంగాధర్‌రెడ్డి తన భార్య శ్రీలక్ష్మితో గొడవ పడి ఇంట్లో ఉన్న ఇనుప పైపును తీసుకుని ఆమె తలపైన గట్టిగా కొట్టగా, కూతురు గంగోత్రి మంచంపై నుంచి లేచి అడ్డుపడింది. దీంతో అదే పైపుతో కూతురు తలపై కూడా కొట్టడంతో ఇద్దరూ గట్టిగా అరుస్తూ తల నుంచి రక్తం కారుతూ చెరో మంచంపై పడిపోయారు. కొన ఊపిరితో ఉన్న ఇద్దరినీ ఇంట్లోని మచ్చుకత్తితో నరకగా రక్తం కారి చనిపోయారని సీఐ వివరించారు. ఈ కేసులోని నిందితుడు గంగాధర్‌రెడ్డిని బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు టి.తుమ్మలపల్లె రోడ్డులో చీనీ తోట వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

చెన్నూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన కొండిగారి ప్రదీప్ (18) అనే యువకుడు విషద్రావణం తాగి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన సుబ్బరాయుడు కుమారుడు ప్రదీప్ గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ జిల్లాలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల సెలవుల రీత్యా చెన్నూరుకు వచ్చిన ఆ యువకుడు ఇంటి వద్ద అల్లరి చేస్తుండడంతో అతని తల్లి లక్షుమ్మ మందలించింది. దీంతో ఈ నెల 6న మనస్థాపం చెంది విషద్రావణం తాగాడు. దీంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చికిత్స నిమిత్తం స్థానిక చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలువలో పడి ఆర్టీసీ డ్రైవర్ మృతి



చాపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం మిండాల వెంకటేశ్వర్లు (59) మద్యం తాగి మురికి కాలువలో పడి మృతి చెందాడు. ఆయన ఇంటి బయట ఉన్న అరుగుపై పడుకుని పక్కకుదొర్లి కాలువలో పడటంతో ఈ సంఘటన జరిగింది. కొంతసేపటికి ఇంటి పక్కనున్న మహిళలు గమనించి ఇతరుల సహాయంతో అతన్ని కాలువలో నుంచి బయటకు తీయగా.. అప్పటికే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మైదుకూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అతనికి భార్య, కూతుర్లు ఉన్నారు.

మల్లెపూల తోట దగ్ధం



కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీవం పేట గ్రామంలో మల్లెపూల తోటను గుర్తు తెలియని దుండగులు కాల్చి వేసినట్లు రైతు నవనీశ్వర్‌రెడ్డి తెలిపారు. కొండాయపల్లెకు చెందిన నవనీశ్వర్‌రెడ్డి 1.5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అందులో మల్లెతోట సాగు చేశాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి తోట కాలి దగ్ధమైంది. దాదాపు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. గుర్తు తెలియని దుండగులు కాల్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లానని రైతు తెలిపాడు.

అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్‌సీఎన్ఆర్ కళాశాల విద్యార్థి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ మహిళల టోర్నమెంట్‌కు ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ నిషాల్ తెలిపారు. కళాశాల బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని వై.అరుణ మంగళవారం యోగివేమన యూనివర్శిటీలో జరిగిన మూడో విడత అంతర్ కళాశాలల పోటీలలో ప్రతిభ కనబరచి అంతర్‌విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైంది. తమిళనాడులోని అలగప్ప యూనివర్శిటీలో త్వరలో జరిగే అఖిలభారత అంతర్ విశ్వవిద్యాయాల పోటీల్లో ఆ విద్యార్థిని పాల్గొంటుంది.

అంతర్‌జిల్లా ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



బైకుల దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరుస ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న అంతర్ జిల్లా బైకుల దొంగ భరత్‌కుమార్ అనే యువకుడిని అరెస్టు చేశామని సీఐ రోషన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీఎస్పీ వెంకటేశ్వర సహకారంతో మండల పరిధిలోని ఖాజీపేటకు పోయే దారిలో ఉన్న పాగేరు వంక వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో ఉన్న యువకున్ని గుర్తించి అదుపులోకి తీసుకుని.. అతన్ని విచారించగా బైకులు దొంగతనం చేస్తున్నట్లు తేలిందన్నారు. ఇతను పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడిన అంతర్ జిల్లా దొంగ భరత్ కుమార్‌గా గుర్తించామన్నారు. అతనిది ఖాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామం అని... భరత్‌కుమార్ చిన్నప్పటి నుంచి చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం బైకు దొంగతనాలకు పాల్పడేవాడు. దొంగలించిన బైకులను అమ్ముకునేవాడు. అదే క్రమంలో కమలాపురంలో గతంలో దొంగతనం చేసిన బైకులను బుధవారం అమ్మాలని ప్రయత్నించే క్రమంలో అరెస్టు చేశామన్నారు. అతని దగ్గర నుంచి ప్లాటినా 100 సీసీ ఏపీడీ4 బీసీ 4323, యమహా ఎఫ్‌జెడ్ఎస్ నెంబరు 02 బీసీ 5500 హెచ్ఎఫ్ డీలక్స్ ఎపీ 39 కేఆర్ 9613 గల మూడు బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన నిందితులపై ఇది వరకే ఖాజీపేట, జమ్మలమడుగు, కమలాపురం, తాడిపత్రి, రైల్వేకోడూరు పోలీసుస్టేషన్లలో బైకు దొంగతనం కేసులు ఉన్నట్లు వివరించారు. నిందితుని అరెస్టు చేయడంలో సహకరించిన పోలీసులకు అభినందనలు తెలుపు తున్నామన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి



రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలకు ర్యాలీగా వస్తున్న రైతు సంఘం నేతలు, సీపీఐ నేతలు

రాయచోటిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా రెండవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి సమస్యలు తీరాలంటే హంద్రీ-నీవా నుంచి వెలిగల్లుకు నీరు వదలాలన్నారు. వెలిగల్లు నుంచి చిన్నకాలువలు, పెద్ద కాలువలు పూర్తి చేసి ఆ కాలువలకు నీరు వదిలితే చెరువులకు, బోర్లకు నీరు అందుబాటులో ఉండి రైతులకు మేలు జరుగుతుందన్నారు. రాయచోటి నియోజకవర్గం లోని 6 మండలాల్లో సాగుకు వీలవుతుందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడారు. సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, డాక్టర్ మహేశ్వర్‌రాజు, అర్చనా విద్యా సంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, రైతు సంఘం ఏరియా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాంతానికే గర్వకారణం

రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ





డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అన్నమాచార్య విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చొప్పా గంగిరెడ్డి తదితరులు

రాజంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రాయలసీమకే తలమాణికంగా మారిందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమాచార్య సిల్వర్ జూబ్లి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు బుధవారం రాత్రి జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అన్నమాచార్య కమ్యూనిటీ రేడియేటేషన్ మెగా హెర్ట్జెస్‌ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి చిన్నతనం నుంచి కష్టపడి తమ స్వగ్రామంలో అన్నమయ్య పేరిట విద్యా సంస్థలను నెలకొల్పారన్నారు. ఈ ప్రాంతీయులకు ఉన్నత విద్యను అందించి వేలాది మందికి ఇంజనీరింగ్ ఇతరత్రా ఉద్యోగాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్యలో ఉత్తమ శిక్షణతో పాటు ఉన్నత విద్యా ప్రమాణాలను పాటిస్తూ కొత్త కొత్త విషయాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్.సుదర్శన్‌రావు, వైవీయూ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ క్రిష్ణారెడ్డి, రాష్ట్ర ఫార్మసీ ప్రతినిధి పల్లె రఘునాథ్‌రెడ్డి, రాలసీమ గ్రూప్స్ ఛైర్మన్ కొండారెడ్డి, కేఎస్ఆర్ఎం గ్రూపు కరస్పాండెంట్ రాజేశ్వరి, టెక్ మహేంద్ర ప్రతినిధులు అబ్దుల్ రహీం, ఐటీసీ ఇన్ఫోటెక్ ఎండీ జోషువాడేవిడ్, సినీ ప్రము ఖులు సోమసుందరం, లాస్య, జయచంద్రలు మాట్లాడుతూ అన్నమాచార్య సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో తాము పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అన్నమాచార్య యూనివర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ట్రస్టు ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

విద్యార్థులు చిన్నతనం నుంచే డ్రగ్స్, ఇతరత్ర మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా బాగా చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ నుంచి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వేలాదిమంది విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు యువకులు, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడి తమ జీవితాన్ని చిన్నతనంలోనే సర్వనాశనం చేసకుంటున్నారన్నారు. దీనివల్ల వారిపై పెట్టుకున్న ఆశలు అడియాశలై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారన్నారు. సినీనటులు కేవీ ప్రదీప్, అన్నమాచార్య యూనివర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్సలర్ అభిషేక్‌రెడ్డి, ఛైర్మన్ రామచంద్రారెడ్డి, డీఎస్పీ సుధాకర్, వైస్ ఛైర్మన్ ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.


మురుగు కాలువ లేక పోవడంతో ప్రధాన రహదారిపై నిలచిన వర్షపు నీరు


గాంధీనగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

శిథిలావస్థలో మురుగు కాల్వలు

● నిండిపోయిన పూడిక ● పలుచోట్ల ధ్వంసమైన పైకప్పు ● ఆందోళనలో పట్టణ ప్రజలు

రైల్వేకోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న మురుగుకాల్వలతో రైల్వేకోడూరు పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల కాలువల పైకప్పులు దెబ్బతినడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ కేంద్రంలోని రంగనాయకులపేట, మార్కెట్ వీధి, కొత్తబజారు, పాతబజారు, పగడాల పల్లె, ప్రధాన రహదారి, ఆంజనేయస్వామి గుడివీధి, ఉంగరాలనగర్, వసంతనగర్ తదితర ప్రాంతాల్లో మురుగు నీటి కాల్వలుండగా, కొన్ని ప్రాంతాల్లో అసలు కాల్వలే లేవు. ఈ కాలువలు సైతం అడ్డదిడ్డంగా నిర్మించడంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. చాలా చోట్ల మురుగు కాల్వలకు పై కప్పు లేదు. దీంతో స్థానికులు ఇళ్లు, దుకాణాల్లోని చెత్తంగా కాల్వల్లోనే వేస్తున్నారు. దీంతో అవి పూడుకుపోయి మురుగు ముందుకు క కదలడం లేదు. పగడాలపల్లె, ఆంజనేయస్వామి గుడి వీధి, కృష్ణానగర్, ఉంగరాల నగర్ తదితర ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఉంది. మార్కెట్ వీధిలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మురుగు కాలువ పైకప్పు దెబ్బతినింది. రంగనాయకులపేటలో కాల్వల్లో మట్టి పేరుకు పోవడంతో నీరు కదలక దుర్వాసన వెలువడుతోంది. దీంతో దోమలు పెరిగిపోయి స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ప్రధానదారిలో రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు పోవడానికి ఏర్పాటు చేసిన కాలువలను స్థానికులు మురుగు కాలువలుగా ఉపయోగిస్తుండడంతో, పంచాయతీ సిబ్బంది ఏడాదిలో పలుసార్లు వీటిలోని పూడికను తొలగించాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని చేసిన ప్రయత్నాలకు ఆదిలోనే గండి పడింది. గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్ల పైనే ప్రవహిస్తోంది. కాల్వలు నాసిరకంగా నిర్మించడంతో అవి పలు చోట్ల శిథిలమై ప్రస్తుత దుస్థితికి కారణమవుతున్నా, అధికారులు పాలుకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు ఇచ్చే నాయకులు పాలకులుగా మారిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు మురుగు కాల్వలకు సరిపడ నిధులు సమకూర్చి బాగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయండి



కాల్వలు నిర్మించి చాలా కాలం కావడంతో దెబ్బతింటున్నాయి. కొన్ని కాల్వలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పైకప్పునకు రంధ్రాలు పడడంతో ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు మురుగు కాల్వలకు మరమ్మతులు చేయించాలి

- ఉంగరాల కృష్ణ

అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి



పట్టణంలో పూర్తిగా అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఓట్లు వేయించుకుంటున్న రాజకీయ నాయకులు మురుగు కాల్వలపై శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుతమున్న మురుగునీటి వ్యవస్థతో ఇబ్బందులు అధికమయ్యాయి. ప్రజలకు ఇబ్బందులను ప్రజాప్రతినిధులు గుర్తించాలి.

- ఓసూరి రాఘవులు

పంచాయతీ ఏవోపై చర్యలు తీసుకోవాలి


బాధితులతో కలిసి డీఆర్‌వోకు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ వెంకట్రమణను అసభ్య పదజాలంతో దూషిస్తూ తోటి ఉద్యోగుల ముందు అవమానిస్తున్న ఏవో గురుమోహన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ మోహన్ డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎల్ వెంకటేశ్ మాట్లాడుతూ బాధ్యతాయుత పదవిలో ఉండి అంకిత భావంతో పనిచేయాల్సిన అధికారి ఒక రాజకీయ నాయకుడులా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఇతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

కోడూరు సమస్యలపై సీఎంకు వినతి

రైల్వేకోడూరు, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి) : ఎలాంటి పదవులు లేకున్నా పాతికేళ్లుగా టీడీపీని నమ్ముకుని పనిచేస్తున్నానని, తనకు న్యాయం చేయాలని కుప్పంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మైనార్టీ నాయకుడు పఠాన్ మౌలా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించానని, నియోజకవర్గంలో పనులన్నీ ఏకపక్షంగా జరుగుతుండడంతో కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, పదవులు రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపానన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధ్యాన్యమిస్తున్నారని ముఖ్య మంత్రి వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు వివరించారు. దీంతో, క్యాంపు కార్యాలయంలో తనను కలవమని ముఖ్యమంత్రి సూచించారని వివరించారు.

డివైడర్ ఏర్పాటు చేయాలి


సీఐ హేమసుందరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సర్కిల్ వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు సీఐ కే. హేమసుందర రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్టాండు, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న స్టాప్‌గేట్స్‌ను మూడు నెలల క్రితం తొలగించడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటోలు, మోటారు సైకిళ్లు ఇష్టమొచ్చినట్లు అటు, ఇటు తిరుగడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ కూడలిలో పోలీస్ కానిస్టేబుల్ కూడా ఉండరని తెలిపారు. వెంటనే రోడ్లు భవనాల శాఖ అధికారులు డివైడర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మొగిలి వినయ్, ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి శెట్టిపల్లి నరసయ్య పాల్గొన్నారు.

రేపు వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం

చిన్నమండెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం మండలంలోని చాకిబండ గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వార దర్శనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అభిషేకం, అలంకరణ, ఉత్తర ద్వార దర్శనం, అనంతరం ఉదయం 9.30 గంటలకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

విధులకు హాజరుకాని వైద్యులు.. ఇబ్బందుల్లో ప్రజలు

వీరబల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇరువురు డాక్టర్లు ఉండగా సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో వైద్యం కోసం వస్తున్న ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఒకరిని 104 కేటాయించగా.. మరొకరు విధులకు సక్రమంగా రావడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో సిబ్బంది కూడా నామమాత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో 100 నుంచి 200వరకు ఉండే ఓపీ ప్రస్తుతం వందలోపునకు పడిపోయింది. అత్యవసర చికిత్స అవసరమైన వారు రాయచోటి ప్రాంతానికి తరలివెళుతున్నారు. బుధవారం జూనియర్ కళాశాల అధ్యాపకుడు రమేశ్‌రాజుకు ఛాతీలో నొప్పి రావడంతో మధ్యాహ్నాం 3 గంటలకు వీరబల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా, వైద్యులు లేకపోవడంతో రాయచోటికి వెళ్లాల్సి వచ్చింది. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వైద్యులు విధులు సక్రమంగా నిర్వర్తించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పశువులకు లింగ నిర్ధారణ పరీక్షలు

రాజంపేట టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారపురెడ్డిపల్లె లో రాష్ట్రీయ గోకుల మిషన్ పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశువులకు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జాతీయ గర్భదారణ కార్యక్రమం ద్వారా పుట్టిన లేగదూడలను ప్రదర్శించారు. లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భదారణ తదితర అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ రాజంపేట ఉపసంచాలకులు డాక్టర్ విజయ్‌భాస్కర్‌రావు, డాక్టర్ ప్రతాప్, శివరామిరెడ్డి తదితరులు మాట్లాడుతూ పశువుల్లో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించాలన్నారు. డాక్టర్ శరత్, వరదయ్య, పెంచల్‌రాజు, వెంకటసుబ్బయ్య, భాను, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలి

నందలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషిచేయాలని ఎంపీపీ మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడవో రాధాకృష్ణ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీలు నయనపల్లె అనుదీప్, తుమ్మల భావన, మండల కోఆప్షన్ సభ్యులు కరీముల్లాఖాన్, ఎంపీటీసీలు సోమిశెట్టి సునీత, రమేష్‌రెడ్డి, సుభాన్‌బాషా, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

చిన్నమండెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో పూత, పిందె సమయంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు ఉద్యాన శాఖ అధికారి వనితాబాయి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఒక లీటరు నీటికి పదిగ్రాముల చొప్పున మల్టీకేను కలిపి పిచికారీ చేస్తే పూత త్వరగా వస్తుందన్నారు. తేనె మంచు పురుగు, అంత్రాక్నోస్ తెగుళ్లు, పూతమాడు, బూడిద్ల, మసితెగుళ్ల నివారణకు మొదటి దశలో ఒక లీటరు నీళ్లకు మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. దానితోపాటు సల్ఫర్ మూడు గ్రాములు ఒక లీటరు నీళ్లకు కలిపి పిచికారి చేయాలి. సాఫ్ 2 గ్రాములు ఒక లీటరు నీళ్లకు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా మొదటి దశ తర్వాత రెండో దశలో కూడా యాజమాన్య పద్ధతులను రైతులు పాటిస్తే అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని వివరించారు.

అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్న రైతు

సిద్దవటం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇసుక తవ్వకాల కారణంగా తమ పొలాలు దెబ్బతింటున్నాయంటూ టక్కోలి గ్రామానికి చెందిన చెన్నయ్య అనే రైతు బుధవారం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్నాడు. తమ పొలాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరాడు.

మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడుగా గురుశేఖర్

రామాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్పనాయుని చెరువుకు చెందిన కొండబోయిన గురుశేఖర్ మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బుధవారం తంబళ్లపల్లె టీడీపీ కార్యాలయంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.

కేబుల్ చోరీ

సంబేపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తన పొలంలోని బోరుకు ఏర్పాటు చేసిన 140 మీటర్ల కేబుల్ వైరును మంగళవారం రాత్రి చోరీ చేశారని సంబేపల్లె మండలం దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లికి చెందిన శంకరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ బోరు కింద మూడెకరాల్లోల దోస పైరు సాగులో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం సీజ్

రాయచోటి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన 660 బస్తాల రేషన్ బియ్యాన్ని అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. స్థానిక లక్ష్మీ థియేటర్ వెనుక ఉన్న ఓ గదిని జిలాన్ అనే వ్యక్తి అద్దెకు తీసుకుని అందులో 660 బస్తాల రేషన్ బియ్యాన్ని నిలువ చేశాడు. ఈ విషయంపై సమాచారమందుకున్న అర్బన్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి బియ్యాన్ని సీజ్ చేశారు. పరారీలో ఉన్న నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


దేవాలయ మాన్యాల రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్

వీర బల్లి, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. గడికోటలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గడికోట గ్రామంలో రాయచోటి వీరభద్రస్వామి ఆలయానికి చెందిన 179 ఎకరాల వరకు భూములుండగా, 44 ఎకరాలకు రెవెన్యూ రికార్డులు ఉన్నాయన్నారు. మిగిలిన 135 ఎకరాలకు సంబంధించిన రికార్డుల కోసం ఆరా తీస్తామన్నారు.ఈ భూముల మ్యుటేషన్,పట్టాదారు పాసు పుస్తకం, సర్వే చేసి ఆక్రమణదారులను గుర్తించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసులు అందజేసి నిబంధనల ప్రకారం ఆక్రమణలు తొలగిస్తామన్నారు. కొన్నిచోట్ల దేవాదాయ భూములను అనుభవిస్తూ కౌలు చెల్లించడం లేదని, ఇటువంటి రైతులు వెంటనే కౌలు చెల్లించి రసీదులు పొందాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రావణితో కలిసి ఆలయ భూముల రికార్డులను పరిశీలించారు. భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తెలిపారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన అర్జీలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్రాలయ ఈవో డీవీ రమణారెడ్డి, వీఆర్‌వో లోకనాథ్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండాలకోన ఆలయ రోడ్డు పనులకు భూమి పూజ

ఓబులవారిపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోట గుండాలకోన ఆలయానికి వెళ్లే మార్గంలో 2.5 కిలోమీటర్ల సిమెంటురోడ్డు పనులకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రాజు, కమతం నాగరాజు, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, కల్లా చలపతి, బాలాజీ, సర్పంచ్ ఈశ్వరయ్య, ఉమ్మలరాజు సుబ్బరాజు, వేణుగోపాల్‌రెడ్డి, పలువురు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గొబ్బూరివారిపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముక్కా రూపానందరెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ఓబులవారిపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మంగలంపల్లె ఎస్టీ కాలనీ వారి భూములను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య బుధవారం రెవెన్యూ సదస్సులో తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. మంగలంపల్లె కు చెందిన 20 గిరిజన కుటుంబాలకు సర్వేనంబరు 2604/1, 2604/2లలో ప్రభుత్వం ఇచ్చిన భూములను మంగళంపల్లె గ్రామ పంచాయతీకి చెందిన కాకర్ల మధుసూదన్ నాయుడు సతీమణి కాకర్ల శర్వాణి పేరుతో అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడని ఆరోపించారు. అతనిపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. తహసీల్దారు స్పందించి ఈనెల 18 లోగా ఆ భూమిని పరిశీలించి గిరిజనులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రాజంపేట, రైల్వేకోడూరుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

రాజంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్లలో గతంలో ఉన్న విధంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని గుంతకల్ డివిజనల్ మేనేజర్ మనోజ్‌కుమార్‌ను అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంతకల్‌లో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తన అభ్యర్థన మేరకు ఇటీవల జయంతి ఎక్స్‌ప్రెస్ ఆపడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారులకు తెలిపి త్వరలో స్టాపింగ్‌కు చర్యలు తీసుకుంటామని ఆర్డీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు గంగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శివరాజు, భానుప్రకాష్‌రాజు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజనల్ మేనేజర్‌ను సాయిలోకేష్ ఘనంగా సత్కరించారు.

రాజంపేట నోబుల్ టీచర్స్ కార్యవర్గం ఎన్నిక

రాజంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, రాజంపేట నాయకులు సోమశేఖర్, జమాల్‌బాషా ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. రాజంపేట మండలశాఖ అధ్యక్షుడుగా జమాల్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్, పెనగలూరు అధ్యక్ష, కార్యదర్శులుగా పి.వెంకటరమణ, బండి రవి, నందలూరు అధ్యక్షుడుగా పి.వెంకటసుబ్బయ్య, కార్యదర్శులుగా అదిల్‌బాషా, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత యేడాది జులైలో ప్రభుత్వం ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నప్పటికి ఇంతవరకు చేయకపోవడం దారుణమన్నారు. వెనువెంటనే 12 పీఆర్సీ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, మధ్యంతర భృతిని, ఉపాధ్యాయుల బదిలీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భారత రాజ్యాంగ లక్ష్యాలను పాఠ్యాంశాల్లో చేర్చాలి

● న్యాయ చైతన్య సదస్సులో ఐఏఎల్ డిమాండ్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐఏఎల్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు టీ. ఈశ్వర్

రాయచోటిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ లక్ష్యాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని చందన ఒకేషనల్ జూనియర్ కళాశాలలో భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం చట్టాలపై అవగాహన కోసం న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో ఐదువేల పైచిలుకు కులాలు, పదుల సంఖ్యలో మతాలు ఉన్నాయని, అయితే వాటన్నింటి హక్కులను భారత రాజ్యాంగం పరిరక్షిస్తుందన్నారు. రా జ్యాంగం ఆధారంగానే దేశంలోని అన్ని చట్టాలు తయారవుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం లక్ష్యాలను విద్యార్థి దశ నుంచి తెలుసుకోవడానికి పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా చట్టాలపై ఆనంద్‌కుమార్, బాల్యవివాహాల చట్టంపై రెడ్డెయ్య, ట్రాఫిక్ చట్టాలపై ధనుంజయ్‌కుమార్, పర్యావరణంపై నాగముని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధిక చట్టంపై న్యాయవాది రవిశంకర్, ఇతర చట్టాలపై హుమయూన్‌బాషా, ఆర్డీ ఆనంద్ మాట్లాడారు. అంతకుముందు ఏఐఎస్ఎఫ్ నాయకుడు కోటేశ్వరరావు, చందన శ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు న్యాయవాదులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

సమన్వయంతోనే ఎయిడ్స్ నివారణ

● జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతోనే ఎయిడ్స్ మహమ్మారి నివారణ సాధ్యమని అన్నమయ్య జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఎయిడ్స్ నివారణపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధిపై మాట్లాడుకున్నప్పుడే ప్రజల్లో చైతన్యం వస్తుందన్నారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న ఐసీటీసీ, సురక్ష, ఏఆర్టీ కేంద్రాలు, రక్తనిధులు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోగలమని తెలిపారు. జిల్లాలో 9 ఐసీటీసీ కేంద్రాల ద్వారా జీవిత కాలం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు హైరిస్క్‌లో ఉన్న వారిని గుర్తించి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సాక్స్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్, పర్యవేక్షకుడు ప్రసాద్, జిల్లా సిబ్బంది పుల్లయ్య, సిలార్‌సాబ్, సాధిక్, చైల్డ్ ఫండ్ ఇండియా జిల్లా రీసోర్స్ పర్సన్ అల్లావలి, జిల్లా పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు ఉషారాణి, ఐసీటీసీ, సురక్ష కేంద్రాల కౌన్సిలర్లు, ఏఆర్టీ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది, ఏపీ సాక్స్ పార్టనర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11న లూయీ బ్రెయిలీ దినోత్సవం

రాయచోటిటౌన్, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో లూయీ బ్రెయిలీ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జాతీయ అంధుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నాగేంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా అంధులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే అంధులకు మధ్యాహ్నం, సాయంత్రం భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

రూ.11.83 కోట్లతో ప్రతిపాదనలు

- కేంద్ర బృందానికి నివేదించిన కలెక్టర్ ● 19 మండలాల్లో దుర్భిక్షం



కేంద్ర బృందానికి కరువు పరిస్థితిని వివరిస్తున్న కలెక్టర్

మదనపల్లెటౌన్/ వాల్మీకిపురం/ తంబళ్లపల్లె/ కురబలకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 30 మండలాలకు గాను 19 మండలాల్లో కరువు వలన దుర్భిక్షం ఏర్పడిందని, ఖరీఫ్‌లో పంట నష్టపరిహారానికి రూ.11.83 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ కేంద్ర కరువు పరిశీలన బృందానికి నివేదించారు. బుధవారం జిల్లాలోని బి.కొత్తకోట, తంబళ్లపల్లె, వాల్మీకిపురం మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందం మధ్యాహ్నానికి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇక్కడ కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందం లీడర్ పెరిన్‌దేవి, సభ్యులు సుప్రియ మాలిక్, అనురాధ బటనా, ఆశిశ్‌పాండేలకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ఖరీఫ్‌లో రైతులు 42 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారని వర్షాభావం వలన 60 శాతం పంట నష్టపోయారన్నారు. 10 వేల హెక్టర్లలో వరి పంట సాగు చేసినా చెరువుల్లో సరిపడా సాగునీరు లేకసరైన దిగుబడి రాలేదన్నారు. కేంద్రం పశుగ్రాసం సరఫరా చేస్తే పాడి రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా 19 మండలాల్లో తాగునీటి సమస్యలు రావడంతో ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేశామన్నారు. కరువు వలన ఎంతో మంది రైతులు ఊర్లు విడిచి వలసలు వెళ్లారని, ఉపాధి హామీ పథకంలో వలసవెళ్లని ప్రజలను ఆదుకున్నామన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఏవో చంద్రానాయక్, ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వాల్మీకిపురం మండలంలోని జర్రావారిపల్లెలో బుధవారం మధ్యాహ్నం కేంద్ర కరువు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కరువు పరిస్థితులపై ఫొటో ప్రదర్శనను పరిశీలించి స్థానిక స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ముఖాముఖిలో రైతులు పలు సమస్యలను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి గ్రామానికి సాగు, తాగునీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన కరువు బృందం అధికారులు పూర్తి సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయక చర్యలు చేపట్టేలా చూస్తామని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్ పామిలేటి, ఇతర జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపోయాం..ఆదుకోండి

కరువుతో పంటలు నష్టపోయాం.. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూసి తమను ఆదుకోవాలని కేంద్ర కరువు బృందం అధికారులకు రైతులు మొరపెట్టుకున్నారు. బుధవారం జిల్లా అధికారులతో కలిసి కేంద్ర కరువు బృందం అధికారులు తంబళ్లపల్లె మండలంలోని కోటకొండ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకుని పలు సలహాలు, సూచనలు చేశారు.నూనె గింజలు, టమోటా, వరి వంటి ఉత్పత్తులు రాయలసీమ ప్రాంతాల నుంచి దేశ స్థాయిలో సరఫరా అవుతున్నాయని అటువంటి ప్రాంతంలో 30 ఏళ్ల పాత రకాలైన కే6, నారాయణి, ధరణి వంటి వేరుశనగ విత్తన రకాలు పంపిణీ చేయడంపై అధికారులపై కేంద్ర బృందం అధికారి పెరిన్‌దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు హరికుమార్, ఏవో రమణకుమార్, ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, రైతులు, ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

కరువు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కరువు బృంద అధికారి పెరిన్‌దేవి తెలిపారు. బుధవారం కురబలకోట మండలంలోని మట్లివారిపల్లెలో కేంద్ర కరువు బృందం పర్యటించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో 'అన్నమయ్య' ప్రతిభ

- సౌత్ ఇండియాకు రెండు ప్రాజెక్టులు ఎంపిక

రాయచోటి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థులు ప్రదర్శించిన రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 6 ప్రాజెక్టులను ప్రదర్శించగా రెండు ప్రాజెక్టులు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. ఇందులో టీచర్స్ విభాగం నుంచి చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివ నారాయణగౌడ్ రూపొందించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి కాపర్ కోటెడ్ బాటిల్ ప్రాజెక్టు, విద్యార్థుల గ్రూపులో కలకడ మోడల్ స్కూల్‌కు చెందిన మహమ్మద్ సుహేల్, రెహాన్‌లు రూపొందించిన బయో ఎంజైమ్స్ ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. గ్రూపు ప్రాజెక్టుకు సుమతి గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరాజు, ఎన్‌సీఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి, విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ పురుషోత్తం వీరికి జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో నిర్వహించే దక్షిణ భారతదేశ సైన్స్ ప్రదర్శనలో వీరు పాల్గొననున్నారని తెలిపారు. విజేతలతో పాటు గైడ్ టీచర్లను డీఈవో సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బాలనాగేంద్ర, ప్రసాద్, ప్రిన్సిపాల్ మౌలామ్‌బాషా వలి అభినందించారు.



టీచర్స్ విభాగంలో శివనారాయణగౌడ్, విద్యార్థులు మహమ్మద్ సుహేల్, రెహాన్

ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు లాభాలు

ఉద్యాన పంటలను పరిశీలించిన రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు




పీటీఎంలో జీవామృతం ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని మడుమూరు గ్రామం వద్ద కొండా నరేంద్ర ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో 70 ఎకరాల్లో సాగు చేసిన అవకాడో, నేరేడు, అరటి, మామిడి, మునగ, నిమ్మ, ఉసిరి తదితర పంటలను పరిశీలించారు. అనంతరం మద్దయ్యగారిపల్లె సమీపంలో ప్రభుత్వం రూ.65 లక్షలతో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీవో (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) కేంద్రాన్ని పరిశీలించారు. పెద్దతిప్పసముద్రం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం డ్రిప్ పరికరాల కోసం రూ.450 కోట్లు, ఉద్యాన పంటలకు మరో రూ.70 కోట్లు ఆయిల్‌పాం పంటల కోసం రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట డీఎంఐఏవో లక్ష్మీప్రసన్న, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు హార్టికల్చర్ అధికారి భీమేష్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్నతో కలిసి బుధవారం బి.కొత్తకోట మండలంలో హార్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. కోటావూరు గ్రామ సచివాలయంలో మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాల హార్టికల్చర్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని గుడిపల్లి పంచాయతీ పరిధిలో రైతు నగేష్ రూ.16 లక్షల రాయితీతో నిర్మించిన పాలీహౌస్‌లను సందర్శించి అందులో ఆధునిక పద్ధతిలో సాగు చేసిన రోజా పూల సాగును పరిశీలించి యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్‌పై రైతు నగేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విలేఖర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో 3 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ చేపట్టబోతున్నామన్నారు. రూ.3978 కోట్ల బడ్జెట్‌తో హార్టికల్చర్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కమిషనర్‌ను ఏపీఎంఐపీ ఎంఐ ఇంజనీర్ల సంఘం ప్రతినిధి హరి కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

ముక్కోటి ఏకాదశికి రామాలయంలో ఏర్పాట్లు



రామాలయం వద్ద క్యూ లైనును సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామాలయానికి పెద్దఎత్తున జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారనే ఉద్దేశ్యంతో ముందుగా టీటీడీ అధికారులు రామాలయం చుట్టూ ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశారు. అందుకోసం సిబ్బంది రామాలయం మాడవీధుల్లో ఎండవేడిని తట్టుకునేందుకు చలువ పందిళ్లతో పాటు క్యూలైన్లలో పైకప్పును ఏర్పాటు చేశారు. కోదండరామాలయ అభివృద్ధి పను లు జరుగుతున్నందున బాలాలయ పూజలు అందుకుంటున్న సీతారామలక్ష్మణులు రామాలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కోదండరామాలయంలో భక్తులను ఆకట్టుకునే విధంగా బెంగళూరు నుంచి తీసుకువచ్చిన పూలతో రామాలయంలోని ధ్వజస్తంభం, రంగమండపంలో ప్రత్యేక పూలంకరణ చేపట్టనున్నారు. వీటితో పాటు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులకు పులిహోర, చక్కర పొంగలిని ప్రత్యేకంగా తయారు చేసి భక్తులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. టీడీపీ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి ముక్కోటికి 2 లక్షల రూపాయల నగదును పూల కోసం అందచేశారని నిర్వాహకులు ముమ్మడి నారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడులు తెలిపారు.

కూల్‌డ్రింక్ స్టాక్ పాయింట్‌లో పేలుడు






అగ్నిప్రమాదంలో కాలిపోయిన కూల్‌డ్రింక్స్ బాటిళ్లు, నెర్రెలు చీలిన గోడ

- రూ.40 లక్షలకు పైగా ఆస్తినష్టం

తంబళ్లపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్స్ స్టాకు పాయింట్‌లో భారీ పేలుడు సంభవించడంతో కూల్‌డ్రింక్స్‌తో పాటు వస్తు సామాగ్రి కాలిపోయి, భవనం పూర్తిగా దెబ్బతిని సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లిన ఘటన తంబళ్లపల్లెలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ చేలూరివాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు పురుషోత్తం కూల్‌డ్రింక్స్‌కు డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. దీంతో ఓ నూతన భవనం నిర్మించుకుని అందులో కూల్‌డ్రింక్స్ స్టాకు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో స్టాకు పాయింట్ పక్కనే ఉన్న ఇంట్లో పురుషోత్తం నిద్రిస్తుండగా ఉన్నట్లుండి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించి మంటలు చేలరేగాయి. దీంతో తేరుకున్న పురుషోత్తం, కుటుంబసభ్యులు స్టాకు ఉన్న భవనం వద్దకు వెళ్లి చూడగా మంటలు చెలరేగుతున్నాయి. దీంతో హుటాహుటిన పురుషోత్తంతో పాటు గ్రామస్తులు తీవ్రంగా కృషి చేసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే అందులో స్టాకు ఉన్న సుమారు రూ.20 లక్షల విలువ చేసే కూల్‌డ్రింక్స్‌తో పాటు, వస్తు సామాగ్రి కాలిపోయి భవనం పూర్తిగా నెర్రెలు చీలి దెబ్బతింది. ఈ ప్రమాదంలో వస్తు, ఆస్తినష్టంతో కలిపి సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు యజమాని పురుషోత్తం తెలిపాడు. ప్రమాదానికి గల కారణం షార్ట్‌సర్క్యూటా.? లేక కూల్‌డ్రింక్స్‌లో ఉన్న గ్యాస్ లీకేజీ అయ్యి బాటిల్స్ పగలడంతోనా..? అన్నది తెలియాల్సి ఉంది. బుధవారం ఉదయం ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, వీఆర్వో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్ర మాదం జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రమాద స్థలాన్ని సందర్శించి విచారం వ్యక్తం చేశారు. బాధితుడికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

మదనపల్లె టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోందని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ (ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిషన్) ఆధ్వర్యంలో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్‌చార్జీల పెంపు అవసరంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోందన్నారు. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే ఈఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. రాష్ట్రంలో ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ వార్షిక ఆదాయం, బడ్జెట్ తదితర అంశాల ఆధారంగా ఈఆర్‌సీ ప్రజలు, పారిశ్రామికవేత్తల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరిస్తోందన్నారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి, 10వ తేదీ కర్నూల్ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహిస్తారన్నారు. 10వ తేదీ నిర్వహించే సమావేశంలో పాల్గొనే ప్రజలు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుని వర్చువల్ సమావేశంలో వారి అభిప్రాయాలు తెలియజేయవచ్చని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈలు గోవిందరెడ్డి, సురేంద్రనాయక్, హరికుమార్, ఏఈ ఉత్తన్న, అజయ్‌బాబు, ప్రజలు, ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ క్లయిమ్‌లతో రీఫండ్ చేస్తే చిక్కులు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

మదనపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ క్లయిమ్‌లు సృష్టించి ఆదాయపు పన్ను రీఫండ్ పొందితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని ఆదాయపు పన్ను శాఖ తిరుపతి అడిషనల్ కమిషనర్ టి.వి.వంశీధర్ తెలిపారు. స్థానిక బేబీవెల్‌కమ్ హోమ్‌లో బుధవారం ఆదాయపు పన్ను చెల్లించే అసెసీలతో అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వంశీధర్ మాట్లాడుతూ ఇన్‌కంట్యాక్సీ అసెసీలు ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్సును అడ్వాన్సుగా చెల్లిస్తే, సెక్షన్ 234బి, 234సీ సెక్షన్ ప్రకారం వడ్డీ ఉండదని తెలిపారు. ఇన్‌కం ట్యాక్సు నోటీసులు వచ్చే, వాటికి ఎలాంటి సమాధానం ఇవ్వాలి, అడ్వాన్సు ట్యాక్సు ప్రాముఖ్యత, ఏఐఎస్ పోర్టల్, వినియోగాన్ని వివరించారు. అలాగే స్థానిక ఆదాయపు పన్ను శాఖ అధికారి టి.మహ్మద్ ఫారూఖ్ మాట్లాడుతూ ఏఐఎస్ పోర్టల్ వినియోగం, ఫ్రాడులెంట్ రీఫండ్స్‌ను ఎలా అరికట్టాలో వివరించారు. వివాద్ సే విశ్వాస్-2024 పథకాన్ని గురించి ట్యాక్సు పేయర్స్‌కు అవగాహన కల్పించారు. అనంతరం ట్యాక్సు పేయర్స్ అడిగిన ప్రశ్నలు, వారు లేవనెత్తిన సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌కంట్యాక్సు ఇన్‌స్పెక్టర్ సూర్యబాబునాయక్, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యుడు ప్రసాద్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు మదనపల్లె విద్యార్థి



లోహిత్

మదనపల్లె టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు మదనపల్లెకు చెందిన లోహిత్ ఎంపికయ్యాడని డిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్‌పర్సన్లు అమృత, శ్రీదేవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న లోహిత్ 400 రిలే పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి సెలెక్టర్లను ఆకట్టుకున్నాడ టన్నారు. ఇందులో భాగంగా జాతీయస్థాయిలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే అండర్-14 అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ షెహనాజ్‌ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, పీఈటీలు మహమ్మద్, భానుప్రకాష్‌లు లోహిత్‌ను అభినందించారు.

ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖలు ప్రగతి సాధించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమం, ప్రజల ఆరోగ్య సంరక్షణ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల్లో చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ అధికారులు, సిబ్బందితో ఆయా శాఖల అంశాల్లో సాధించిన ప్రగతి, సాధించాలిన ప్రగతి, ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారు. అందుకు గల కారణాలు తదితరాల్లో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్స్, సీడీపీవోల పనితీరుపై సమీక్షించి లక్ష్యాల్లో వెనుకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకుని, తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని పిల్లల హాజరు వందశాతం ఉండేలా కృషి చేయాలన్నారు. కేంద్రానికి పిల్లలు రాకున్నా హాజరు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యఆరోగ్యశాఖకు సంబంధించి సమీక్షిస్తూ వివిధ అంశాల్లో శ్రద్ధ పెట్టి లక్ష సాధనకు కృషి చేయాలని మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొన్ని మండలాలు ప్రగతి సాధనలో బాగా పనిచేస్తున్నాయని, మిగిలిన మండలాలు వెనుకబడి ఉన్నాయని, ఇందుకు గల కారణాలను లోపాలను గుర్తించి సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఏఎన్ఎం తరచూ పాఠశాలలను సందర్శించి వైద్యసేవలు అందించాలన్నారు. జీరో శాతం ప్రగతి ఉన్నవారు మూడురోజుల లోపల ప్రగతి సాధించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో, ఐసీడీఎస్ పీడీ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ పరీక్షలంటే... కాసుల పంటే

- మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా రిమ్స్ వైద్యశాల
- రూ.80వేల నుంచి లక్ష వరకు నర్సింగ్ కళాశాలల నుంచి డబ్బు వసూళ్లు
- డబ్బుల కోసం బాహాటంగా గొడవపడిన సిబ్బంది
- గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో సమాధానాల స్లిప్పులు


మైక్రో జిరాక్స్ తీసిన సమాధానాల స్లిప్పులు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని పుట్లంపల్లె వద్దగల ప్రభుత్వ వైద్యకళాశాల (రిమ్స్) మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా మారింది. దాదాపు 8 నర్సింగ్ కళాశాలలకు సంబంధించి విద్యార్థులకు పరీక్షలను రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు కాపీయింగ్ పాల్పడేందుకు ప్రతి నర్సింగ్ కళాశాల వైద్య కళాశాలకు సుమారు రూ.80వేల నుంచి లక్ష రూపాయల వరకు డబ్బు సమర్పించినట్లు సమాచారం. దీంతో నర్సింగ్ విద్యార్థులు పరీక్షల్లో కాపీయిగ్‌కు పాల్పడేందుకు పూర్తిగా స్వేచ్ఛను ఇస్తూ వైద్య కళాశాల అధికారులు చూసీచూనడట్లు వ్యవహరిస్తున్నారు. పరీక్ష మొదలవగానే ప్రశ్నాపత్రాన్ని బయటకు పంపిస్తున్నారు. కాసేపటికి జవాబులను రాసుకువచ్చి విద్యార్థులకు చెబుతున్నారు. నర్సింగ్ పరీక్షలను వైద్య కళాశాలలోని గ్యాలరీ, డెమో హాల్‌లో నిర్వహిస్తున్నారు. అక్కడ కెమెరాలు పనిచేయవు, ఉండవు. నర్సింగ్ కళాశాలల నుంచి డబ్బు అందుకోవడంతో వైద్య కళాశాల అధికారులు మాస్ కాపీయింగ్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అదనపు వసూళ్లు

నర్సింగ్ కళాశాల నుంచి గుత్త మొత్తంలో డబ్బులు అందుతున్నా పరీక్ష సమయంలో విద్యార్థులకు మరింత సహాయ సహకారాలు అందిస్తామంటూ వైద్య కళాశాల సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యార్థుల వద్ద రూ.2వేల నుంచి రూ.4వేలు వసూళ్లు చేసి త్వరితగతిన సమాధానాలు చేరవేస్తున్నారు. జవాబులను మైక్రో జిరాక్స్ ద్వారా తెప్పించి విద్యార్థులకు అందిస్తున్నారు. ఇదంతా వైద్య కళాశాలలో బాహాటంగా జరుగుతున్నా మాకెందుకులే అన్నట్లు కొందరు సిబ్బంది ఉంటున్నారు.

డబ్బుల పంపకాల్లో గొడవ

నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, యాజమాన్యాలు ఇచ్చిన డబ్బుల పంపకంలో తేడాలు రావడంతో ఇద్దరు ప్రభుత్వ వైద్యకళాశాల సిబ్బంది 6వ తేదీ సోమవారం గొడవపడినట్లు సమాచారం. వైద్య కళాశాలకు చెందిన సీనియర్ అసిస్టెంట్, అటెండర్‌ల మధ్య ఈ గొడవ జరిగినట్లు తెలుస్తోంది. వైద్య కళాశాల అధికారులకు సైతం ఈ డబ్బుల పంపకాల్లో వాటా ఉండడంతో సదరు సంఘటన బయటకు రానీయకుండా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రీవెన్స్ సెల్‌లో సైతం ఫిర్యాదు

వైద్య కళాశాలలో కాపీయింగ్ జరుగుతుందని, డబ్బు వసూళ్లు చేస్తున్నారని కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎవరూ ఏమి చేయలేరన్న ధీమాతో ఇంతా జరుగుతోంది.

జిల్లా అధికారుల అలసత్వమా..

గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇలాంటి అక్రమాలకు అలవాటు పడిన సిబ్బంది కూటమి ప్రభుత్వంలో సైతం ఏమాత్రం భయం లేకుండా అందరికీ తెలిసేలా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. దీనిపై సాక్షాత్తు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వైద్యకళాశాలలో నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ స్పందిస్తూ పరీక్షల్లో ఇలాంటివి ఏమీ జరగలేదు. మేము నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఏడాది పీజీ ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసుకున్న విద్యార్థులకు లెటరల్ ఎంట్రీ విధానంలో ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. జాతీయ విద్యా విధానం-2020 అమలులో భాగంగా నూతనంగా ఏడాది పీజీ కోర్సు (2024-25 విద్యా సంవత్సరం) నోటిఫికేషన్ సందర్భంగా ఆయన తన ఛాంబర్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ఆచార్య ఏజీ దాము, డీన్‌లు ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య వై.సుబ్బరాయుడు, సీడీసీ డీఎస్ ఆచార్య రఘుబాబు, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మిప్రసాద్‌తో భేటి అయ్యారు. నోటిఫికేషన్ సంబంధించి వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైవీయూ పరిధిలోని అఫిలియేషన్ కలిగిన అనుబంధ కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చామన్నారు. హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కామర్స్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు కోసం వైవీయు.ఇడియు.ఇన్‌ను సంప్రదించాలని సూచించారు. వెబ్‌సైట్‌లో విశ్వవిద్యాలయంలో లభించే కోర్సులు, సీట్లు సంబంధిత నిబంధనల గల బ్రోచర్ ఉంటుందన్నారు. 21వ తేదీ విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో ప్రవేశాల కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఇజితెమా

- రెండో రోజు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు


ఇజితెమాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మకూరు కేంద్రంగా జరుగుతున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమం రెండో రోజైన బుధవారం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇజితెమా కార్యక్రమానికి మంగళవారం రాత్రికే వేలాది సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. దీంతో బుధవారం తెల్లవారు జాము నుంచే సామూహిక ప్రార్థనలు మొదలయ్యాయి. అలాగే ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి విచ్చేసిన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను బోధించారు. కాగా వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి ఏలోటు రానివ్వకుండా ఇజితెమా నిర్వహణ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ తదితర సదుపాయాలను సమకూర్చారు. అదేవిధంగా ఇజితెమాకు హాజరైన ముస్లిం లకు దాతలు స్వచ్ఛందంగా పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఇదిలావుంటే ఇజితెమా ప్రాంగణమంతా ఎక్కడా చూసినా సందడి వాతావరణం నెలకొంది.

ఇజితెమాను సందర్శించిన ప్రముఖులు : ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో జరుగుతున్న ఇజితెమా కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఇజితెమా ఏర్పాట్ల గురించి కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ పవిత్రమైన ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం శుభపరిణామమన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇజితెమాకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

భార్య, కూతురిని చంపిన నిందితుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎన్.వెంకట రమణ

పులివెందుల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం టి.తుమ్మలపల్లెలో ఈనెల 6వ తేదీ భార్య, కూతురిని చంపిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఎన్.వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ పోలీ సు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తుమ్మల గంగాధరెడ్డి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగి స్తూ.. రోజూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. 6వ తేదీ రాత్రి 9గంటలకు మందు తాగి ఇంటికి వచ్చిన గంగాధర్‌రెడ్డి తన భార్య శ్రీలక్ష్మితో గొడవ పడి ఇంట్లో ఉన్న ఇనుప పైపును తీసుకుని ఆమె తలపైన గట్టిగా కొట్టగా, కూతురు గంగోత్రి మంచంపై నుంచి లేచి అడ్డుపడింది. దీంతో అదే పైపుతో కూతురు తలపై కూడా కొట్టడంతో ఇద్దరూ గట్టిగా అరుస్తూ తల నుంచి రక్తం కారుతూ చెరో మంచంపై పడిపోయారు. కొన ఊపిరితో ఉన్న ఇద్దరినీ ఇంట్లోని మచ్చుకత్తితో నరకగా రక్తం కారి చనిపోయారని సీఐ వివరించారు. ఈ కేసులోని నిందితుడు గంగాధర్‌రెడ్డిని బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు టి.తుమ్మలపల్లె రోడ్డులో చీనీ తోట వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

చెన్నూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన కొండిగారి ప్రదీప్ (18) అనే యువకుడు విషద్రావణం తాగి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన సుబ్బరాయుడు కుమారుడు ప్రదీప్ గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ జిల్లాలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల సెలవుల రీత్యా చెన్నూరుకు వచ్చిన ఆ యువకుడు ఇంటి వద్ద అల్లరి చేస్తుండడంతో అతని తల్లి లక్షుమ్మ మందలించింది. దీంతో ఈ నెల 6న మనస్థాపం చెంది విషద్రావణం తాగాడు. దీంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చికిత్స నిమిత్తం స్థానిక చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలువలో పడి ఆర్టీసీ డ్రైవర్ మృతి



చాపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం మిండాల వెంకటేశ్వర్లు (59) మద్యం తాగి మురికి కాలువలో పడి మృతి చెందాడు. ఆయన ఇంటి బయట ఉన్న అరుగుపై పడుకుని పక్కకుదొర్లి కాలువలో పడటంతో ఈ సంఘటన జరిగింది. కొంతసేపటికి ఇంటి పక్కనున్న మహిళలు గమనించి ఇతరుల సహాయంతో అతన్ని కాలువలో నుంచి బయటకు తీయగా.. అప్పటికే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మైదుకూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అతనికి భార్య, కూతుర్లు ఉన్నారు.

మల్లెపూల తోట దగ్ధం



కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీవం పేట గ్రామంలో మల్లెపూల తోటను గుర్తు తెలియని దుండగులు కాల్చి వేసినట్లు రైతు నవనీశ్వర్‌రెడ్డి తెలిపారు. కొండాయపల్లెకు చెందిన నవనీశ్వర్‌రెడ్డి 1.5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అందులో మల్లెతోట సాగు చేశాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి తోట కాలి దగ్ధమైంది. దాదాపు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. గుర్తు తెలియని దుండగులు కాల్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తానని రైతు తెలిపాడు.

అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్‌సీఎన్‌ఆర్ కళాశాల విద్యార్థి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ మహిళల టోర్నమెంట్‌కు ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ నిషాల్ తెలిపారు. కళాశాల బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని వై.అరుణ మంగళవారం యోగివేమన యూనివర్శిటీలో జరిగిన మూడో విడత అంతర్ కళాశాలల పోటీలలో ప్రతిభ కనబరచి అంతర్‌విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైంది. తమిళనాడులోని అలగప్ప యూనివర్శిటీలో త్వరలో జరిగే అఖిలభారత అంతర్ విశ్వవిద్యాయాల పోటీల్లో ఆ విద్యార్థిని పాల్గొంటుంది.

అంతర్‌జిల్లా ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు


బైకుల దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరుస ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న అంతర్ జిల్లా బైకుల దొంగ భరత్‌కుమార్ అనే యువకుడిని అరెస్టు చేశామని సీఐ రోషన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీఎస్పీ వెంకటేశ్వర సహకారంతో మండల పరిధిలోని ఖాజీపేటకు పోయే దారిలో ఉన్న పాగేరు వంక వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో ఉన్న యువకున్ని గుర్తించి అదుపులోకి తీసుకుని.. అతన్ని విచారించగా బైకులు దొంగతనం చేస్తున్నట్లు తేలిందన్నారు. ఇతను పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడిన అంతర్ జిల్లా దొంగ భరత్ కుమార్‌గా గుర్తించామన్నారు. అతనిది ఖాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామం అని... భరత్‌కుమార్ చిన్నప్పటి నుంచి చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం బైకు దొంగతనాలకు పాల్పడేవాడు. దొంగలించిన బైకులను అమ్ముకునేవాడు. అదే క్రమంలో కమలాపురంలో గతంలో దొంగతనం చేసిన బైకులను బుధవారం అమ్మాలని ప్రయత్నించే క్రమంలో అరెస్టు చేశామన్నారు. అతని దగ్గర నుంచి ప్లాటినా 100 సీసీ ఏపీడీ4 బీసీ 4323, యమహా ఎఫ్‌జెడ్ఎస్ నెంబరు 02 బీసీ 5500 హెచ్ఎఫ్ డీలక్స్ ఎపీ 39 కేఆర్ 9613 గల మూడు బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన నిందితులపై ఇది వరకే ఖాజీపేట, జమ్మలమడుగు, కమలాపురం, తాడిపత్రి, రైల్వేకోడూరు పోలీసుస్టేషన్లలో బైకు దొంగతనం కేసులు ఉన్నట్లు వివరించారు. నిందితుని అరెస్టు చేయడంలో సహకరించిన పోలీసులకు అభినందనలు తెలుపు తున్నామన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి


రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలకు ర్యాలీగా వస్తున్న రైతు సంఘం నేతలు, సీపీఐ నేతలు

రాయచోటిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా రెండవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి సమస్యలు తీరాలంటే హంద్రీ-నీవా నుంచి వెలిగల్లుకు నీరు వదలాలన్నారు. వెలిగల్లు నుంచి చిన్నకాలువలు, పెద్ద కాలువలు పూర్తి చేసి ఆ కాలువలకు నీరు వదిలితే చెరువులకు, బోర్లకు నీరు అందుబాటులో ఉండి రైతులకు మేలు జరుగుతుందన్నారు. రాయచోటి నియోజకవర్గం లోని 6 మండలాల్లో సాగుకు వీలవుతుందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడారు. సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, డాక్టర్ మహేశ్వర్‌రాజు, అర్చనా విద్యా సంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, రైతు సంఘం ఏరియా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాంతానికే గర్వకారణం
రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ




డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అన్నమాచార్య విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చొప్పా గంగిరెడ్డి తదితరులు

రాజంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రాయలసీమకే తలమాణికంగా మారిందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమాచార్య సిల్వర్ జూబ్లి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు బుధవారం రాత్రి జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అన్నమాచార్య కమ్యూనిటీ రేడియేటేషన్ మెగా హెర్ట్జ్‌ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య విద్యాసంస్థల అదినేత చొప్పా గంగిరెడ్డి చిన్నతనం నుంచి కష్టపడి తమ స్వగ్రామంలో అన్నమయ్య పేరిట విద్యా సంస్థలను నెలకొల్పారన్నారు. ఈ ప్రాంతీయులకు ఉన్నత విద్యను అందించి వేలాది మందికి ఇంజనీరింగ్ ఇతరత్రా ఉద్యోగాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్యలో ఉత్తమ శిక్షణతో పాటు ఉన్నత విద్యా ప్రమాణాలను పాటిస్తూ కొత్త కొత్త విషయాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్.సుదర్శన్‌రావు, వైవీయూ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ క్రిష్ణారెడ్డి, రాష్ట్ర ఫార్మసీ ప్రతినిధి పల్లె రఘునాథ్‌రెడ్డి, రాలసీమ గ్రూప్స్ ఛైర్మన్ కొండారెడ్డి, కేఎస్ఆర్ఎం గ్రూపు కరస్పాండెంట్ రాజేశ్వరి, టెక్ మహేంద్ర ప్రతినిధులు అబ్దుల్ రహీం, ఐటీసీ ఇన్ఫోటెక్ ఎండీ జోషువాడేవిడ్, సినీ ప్రము ఖులు సోమసుందరం, లాస్య, జయచంద్రలు మాట్లాడుతూ అన్నమాచార్య సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో తాము పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అన్నమాచార్య యూనివర్శిటీ వ్యవ స్థాపక అధ్యక్షుడు, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ట్రస్టు ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

విద్యార్థులు చిన్నతనం నుంచే డ్రగ్స్ ఇతరత్ర మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా బాగా చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఉద యం రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ నుంచి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వేలాదిమంది విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వ హించగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు యువకులు, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడి తమ జీవితాన్ని చిన్నతనంలోనే సర్వనాశనం చేసకుంటున్నారన్నారు. దీనివల్ల వారిపై పెట్టుకున్న ఆశలు అడియాశలై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారన్నారు. సినీనటులు కేవీ ప్రదీప్, అన్నమాచార్య యూనివర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్సలర్ అభిషేక్‌రెడ్డి, ఛైర్మన్ రామచంద్రారెడ్డి, డీఎస్పీ సుధాకర్, వైస్ ఛైర్మన్ ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి ట్రిపుల్‌ఐటీకి సెలవులు

వేంపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సంక్రాంతి సెలవులలు ప్రకటించారు. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సెలవులు ఇచ్చారు. ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న కొందరు విద్యార్థులకు పూర్తి కాగా బుధవారం నుంచే ఇళ్లకు బయలుదేరారు. తిరిగి 20వ తేదీ ట్రిపుల్‌ఐటీ తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

రాజంపేట, రైల్వేకోడూరుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

రాజంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్లలో గతంలో ఉన్న విధంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని గుంతకల్ డివిజనల్ మేనేజర్ మనోజ్‌కుమార్‌ను అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంతకల్‌లో ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. తన అభ్యర్థన మేరకు ఇటీవల జయంతి ఎక్స్‌ప్రెస్ ఆపడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారులకు తెలిపి త్వరలో స్టాపింగ్‌కు చర్యలు తీసుకుంటామని ఆర్డీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు గంగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శివరాజు, భానుప్రకాష్‌రాజు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అఘాయిత్యానికి గురైన బాధితుల విచారణ


బాధిత కుటుంబ వివరాలు తెలుపుతున్న డీఎస్పీ

నిమ్మనపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో తండ్రి చేతిలో అఘాయిత్యానికి గురైన బాధితులను బుధవారం డీఎస్పీ కొండయ్య విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని మహిళలను విచారించారు. తండ్రి పిల్లలపై చేసిన అఘాయిత్యాన్ని ఎలా తెలుసుకొన్నారని వివరాలు అడిగి రికార్డు చేశారు. ఇప్పటికే చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రమేష్‌బాబు, మదనపల్లి మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ టీవో నాగరాజు కోరారు. బుధవారం స్థానిక ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పది నుంచి డిగ్రీ చదివిన సుమారు 26 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరికి ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన 12 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా టీవో మాట్లాడుతూ.. తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ప్రతి నెల జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు వెంకట్రమణ, సురేంద్ర, అశోక్, రెడ్డివరప్రసాద్, యువతీ యువకులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో జయచంద్రారెడ్డి


కేంద్ర మంత్రిని కలిసిన టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలను కేంద్ర మంత్రికి విన్నవించారు. వెనుకబడిన తమ నియోజకవర్గంలో రహదారులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దతిప్పసముద్రం జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీలను బుధవారం స్థానిక మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌస్‌పీర్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల విద్యాశాఖలో ఎస్టీయూ చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్టీయూ నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కేఆర్ రెడ్డి, రవి, అశ్విని, అశోక్‌కుమార్, రెడ్డెప్పరెడ్డి, గీతు, ప్రియదర్శిని పాల్గొన్నారు.

రైతుల నుంచి అర్జీల స్వీకరణ

పెద్దమండ్యం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు సదస్సులో అధికారులు, కూటమి నేతలు భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు. మండలంలోని శివపురం పాత పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రైతు సదస్సు జరిగింది. గత ప్రభుత్వంలో శివపురం, సిద్దవరం గ్రామాల్లో జరిగిన రీసర్వే భూములకు 1బీ రావడం లేదని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ రైతు సదస్సులో ఇచ్చిన అర్జీలన్నీ పరిష్కరిస్తామన్నారు. ఎంపీటీసీ రుక్మాంగధరెడ్డి, సర్పంచ్ గంగులమ్మ కూటమి నేతలు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, నాగేశ్వరరెడ్డి, క్రిష్టారెడ్డి, బావాజీ, సుబ్బరామిరెడ్డి, సాంబ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, దేవదాయశాఖ కార్యదర్శి రెడ్డిక్రిష్ణ, వీఆర్‌వో పాపారాయుడు, సంజీవులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

● ముస్తాబవుతున్న ఆలయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైకుంఠ ఏకాదశికి పలు ఆలయాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. బుధవారం దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఈవో రమణ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని, వారికి అన్ని సౌకర్యాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తుల దర్శనం కోసం ఉత్తర ద్వారం శుభ్రం చేశామని, తాగునీటి సౌకర్యాలు, బారికేడ్లతో పాటు భక్తులకు రూ.50లతో ప్రత్యేక దర్శనం, ఉచితంగా సర్వదర్శనం ఏర్పాటు చేసినట్లు ఈవో రమణ పేర్కొన్నారు. ఈ రోజే ఆలయ ఆవరణం అంతా శుద్ధి చేసినట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే అనపగుట్టలోని అభయ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సోంపల్లె రమేష్ తెలిపారు. శుక్రవారం ప్రత్యేకంగా భక్తుల కోసం ఉత్తర ద్వారం తెరవనున్నట్లు చెప్పారు. ఆలయంలో విశేష అర్చనలు, అలంకరణ, విశేషపూజలతో పాటు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అలాగే బీటీ కళాశాల గ్రౌండ్ సమీపంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు.


ముస్తాబైన ప్రసన్న వెంకటరమణ ఆలయం

ఉపాధి కూలీలకు కనీస కూలి అందించాలి

● డ్వామా ఏపీడీ మధుబాబు

ములకలచెరువు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస కూలి రూ.300 వచ్చేలా పనులు చేయించాలని డ్వామా ఏపీడీ మధుబాబు పేర్కొన్నారు. ములకలచెరువులో బుధవారం పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి పనుల వద్ద కొలతలు తీసే విధానాన్ని క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు కొలతలు సరిగా తీయక పోవడంతో కూలీలకు కనీస కూలీ రావడం లేదన్నారు. దీంతో కొలతలు తీసే విధానంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీవోలు నారాయణస్వామి, మంజుల తదితరులు పాల్గొన్నారు.


కొలతలపై అవగాహన కల్పిస్తున్న డ్వామా ఏపీడీ మధుబాబు

చిరుత సంచారంపై గ్రామస్థుల భయాందోళన


చిరుత జాడను వెతుకుతున్న గ్రామస్థులు

రామసముద్రం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వై.కురప్రల్లె, యంబాడి గ్రామాల పొలిమేరలో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు తెలిపారు. బుధవారం యంబాడి గ్రామ సమీపంలోని చెరువు వద్ద చిరుత సంచరిస్తున్నట్లు కనుగొన్న గ్రామస్థులు కర్రలు చేతబట్టి చిరుత కోసం వెతికారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారి చిట్టిబాబు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థులతో పాటు చిరుతకోసం వెతికారు. ఎక్కడా చిరుత కనిపించలేదని, అయితే చిరుత సంచరిస్తున్నట్లు పాదముద్రలు ఉన్నాయని తెలిపారు. కాగా గతవారం క్రితం కూడా ఈ ప్రాంతంలో చిరుత తిరుగుతున్నట్లు పలువురు గ్రామస్థులు చెబుతున్నారు. కాగా రైతులు పొలాల వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, చిరుత కనిపిస్తే వెంటనే తమకు తెలపాలని చిట్టిబాబు గ్రామస్థులకు సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

తంబళ్లపల్లె, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసే విధంగా అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ ఏఈ సుజాతతో కలిసి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి వారం ఇళ్ల నిర్మాణాల్లో ఖచ్చితంగా పురోగతి ఉండాలన్నారు. ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్ సర్వీస్ పునరుద్ధరించాలని వినతి

వాల్మీకిపురం,జనవరి8(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం-నిమ్మనపల్లె మార్గంలో, నిమ్మనపల్లె నుంచి వాయల్పాడు మీదుగా గుర్రంకొండ, రాయచోటి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును కల్పించాలని వాల్మీకిపురానికి చెందిన మైనార్టీ నాయకులు చాను, సాదిక్, సందానిబాషా, తదితరులు పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం మదనపల్లె ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎంతో అనుకూలంగా ఉండే ఈ మార్గంలో ఆర్టీసీ సర్వీస్‌ను ఎత్తివేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషాలకు కూడా వినతిపత్రాల ద్వారా విన్నవించుకున్నట్లు తెలిపారు.


జాతీయ విజ్ఞాన ప్రదర్శనకు నమూనా ఎంపిక

కలకడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన నమూనా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మలాంషావలి తెలిపారు. బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో విద్యార్థులు సుహేల్, రేహాన్ ప్రదర్శించిన బయోఇంజెన్ అండ్ బయోకెమికల్ క్లీనర్ ప్రాజెక్ట్‌ను న్యాయనిర్ణేతలు ఎంపిక చేసి ప్రశంసాపత్రాన్ని అందించినట్లు తెలిపారు. జాతీయ ప్రదర్శన పుదిచ్చేరి రాష్ట్రంలో జరుగుతుందని ఆయన తెలిపారు. గైడ్ టీచర్‌గా వ్యవహరించిన సుమతి, విద్యార్థులను, ఉపాధ్యాయులు అభినందించారు.

'కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు'

కురబలకోట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు వెన్నంటే నిలిచిన వారికి నామినేటెడ్ పదవుల్లో అధినేత చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇస్తారని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. బుధవారం అంగళ్లులో మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు, నేతల అభీష్టం మేరకే నిర్ణయం తీసుకొంటుందని, నామినేటెడ్ పదువుల భర్తీకి సంబంధించి తమ అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఈ అభిప్రాయాలను అధిష్టానం వద్దకు తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా 30 మందికిపైగా అభిప్రాయాలను తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మదనపల్లెఅర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో చికిత్స పొందుతూ బుధవారం యువకుడు మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక రెడ్డీస్ కాలనీలో కాపురం ఉండే శ్రీధర్ ఈ నెల 6న విషం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. అయితే అక్కడ చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేయగా, కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య భవాని, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. 15 ఏళ్ల క్రితం బతుకుదెరువుకోసం మదనపల్లెకు బురకాయలకోట నుంచి వలస వచ్చారు. భార్య ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆర్థిక పరిస్థితి సరిలేని కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎంఎస్ఎం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా శేషారెడ్డి


నూతన అధ్యక్షుడు శేషారెడ్డిని పరిచయం చేస్తున్న భాస్కర్‌రెడ్డి

మదనపల్లెటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు వర్కర్స్ యూనియన్ ఎఫ్-100 అధ్యక్షుడిగా న్యాయవాది వై.వి.శేషాడ్డిని ఏకగ్రీవంగా కార్మికులు ఎన్నుకున్నారు. బుధవారం సీటీఎం మిల్లు కార్యాలయం వద్ద 210 మంది కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడుగా పనిచేసిన నందగోపాల్ మృతి చెందాడని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించాలన్నారు. అనంతరం గత ఆరు నెలలుగా జరిగిన విషయాలపై చర్చించి నూతన అధ్యక్షుడుగా వైవీ శేషారెడ్డిని ప్రతిపాదించారు. మెజారిటీ కార్మికులు ఏకగ్రీవంగా శేషారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నరసింగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామసముద్రం మండలానికి చెందిన ముగ్గురు బాధిత కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీకేపల్లె కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే అక్కడ దారి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు కుటుంబాలను ఆదుకోవాలని కుప్పం పర్యటనలో వున్న సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానన్నారు. వెంటనే స్పందించిన సీఎం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, మృతుల దహన కార్యక్రమాలకు రూ.10 వేలు చొప్పున నగదు అందజేశారన్నారు.

'చర్చి అక్రమ నిర్మాణాన్ని ఆపండి'


డీటీ బావాజాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

గుర్రంకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మిస్తున్న చర్చి పనులను ఆపాలంటూ బీజేపీ నాయకులు, తల్లారి వాండ్లపల్లె గ్రామస్థులు బుధవారం డీటీ బావాజాన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి సమీపంలోని సర్వేనెంబరు 617/1, 617/12లో ప్రభుత్వ భూమి ఉందని, ఈ స్థలంలో పూర్వీకుల నుంచి సంక్రాంతి పండుగ రోజున చిట్లాకుప్ప వేసి పండుగ జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. అలాగే హిందువుల మనోభావాలు దెబ్బతినేలా చర్చి నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో చర్చి నిర్మాణ పనులను ఆపాలంటూ హిందూ సంఘాల నాయకులు, గ్రామస్థులు తహసీల్దార్, ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజులు, శ్రీధర్, రామాంజులరెడ్డి, భరత్, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, మునిప్రసాద్, మురళీ, హేమంత్, రెడ్డిశేఖర్, జీవన్, వంశీ, కిషోర్, శివరాం, రమణలు పాల్గొన్నారు.

బీటీ కళాశాలను యూనివర్సిటీగా చేయాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

మదనపల్లె అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బీటీ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ మదనపల్లె ఆధ్వర్యంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు రాందాస్‌చౌదరి మాట్లాడుతూ ఘనచరిత్ర కలిగిన బీటీ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేసుకోవడానికి పార్టీలకు అతీతంగా పోరాటాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీటీ కళాశాల మాజీ కరస్పాండెంట్ వైఎస్ మునిరత్నం మాట్లాడుతూ బీటీ కళాశాలను యూనివర్సిటీ చేయడానికి ట్రస్టు సభ్యులతో మాట్లాడి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం నాయకులు మురళి, సాంబశివ, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్, ఏపీ వాల్మీకి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్, వాల్మీకి సంఘం నాయకులు పులిశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కలకడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోన హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు హెచ్ఎం చెంగల్‌రాయులు తెలిపారు. గత ఏడాది అక్టోబరు-నవంబరు మాసాల్లో రాజమండ్రిలో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో సమీరా, యోగేశ్వర్ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌లో ఈ నెల 10వ తేది జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ ఝాన్సీరాణిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

25న రీసర్వే ప్రారంభం

పెద్దమండ్యం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిగల్లులో ఈ నెల 25 నుంచి భూముల రీసర్వే ప్రారంభం కానున్నట్లు తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ వెల్లడించారు. బుధవారం మండలంలోని శివపురంలో రైతు సదస్సు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా భూములు రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రీసర్వేలో పొరపాట్లు జరగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ హసీన్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

11న జిల్లా హాకీ సబ్ జూనియర్ జట్టు ఎంపిక

మదనపల్లెటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా సబ్ జూనియర్ హాకీ జట్టును ఈ నెల 11న మదనపల్లెలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.ప్రసాద్, బి.శివప్రసాద్, కన్వీనర్ హితేష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె బీటీ కళాశాల మైదానంలో శనివారం ఉదయం నిర్వహించనున్న ఎంపిక కార్యక్రమానికి అండర్-14 విభాగంలో ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు. ఈ ఎంపికకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికేట్ తీసుకురావాలని ట్రెజరర్ ప్రసాదరెడ్డి తెలిపారు.

విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలి

ములకలచెరువు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరూ విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని ఎంఈవో వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఎస్టీయూ - 2025 డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలందరిని బడిలో చేర్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, చంద్రకళ, ఎస్టీయూ నాయకులు అమరనాథరెడ్డి, రాజారెడ్డి, శ్రీరాములు, వెంకటరమణ, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

ములకలచెరువు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో గురువారం నుంచి సంక్రాంతి పండగ సందర్భంగా కట్టా క్రికెట్ టోర్నమెంటు జరుగుతుందని టీఎన్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామి నాయుడు తెలిపారు. ఈ మేరకు టోర్నమెంటు ప్రారంభోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టోర్నమెంటులో విజేతగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతి కింద రూ.1,00,116, రన్నర్స్ జట్టుకు రూ.50,116లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు కట్టా విజయ్‌నాయుడు, యుగ, ఇర్ఫాన్, సాధిక్, వెంకీ పాల్గొన్నారు.

13న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం అభయాంజనేయస్వామి ఆలయంలో 13న సోమవారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా అదే రోజున సాయంత్రం ఆలయంలో కార్యసిద్ధి అభయాంజనేయస్వామికి ఆకుపూజ, సింధూర పూజ, తోమాల, వడమాల సేవలతో పౌర్ణమి పూజలు జరుగుతాయని, భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

గుర్రంకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రైతుల భూముల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మర్రిపాడులో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పీఎం సూర్య ఘర్

నిమ్మనపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు ఉచితంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఏడీ సురేంద్రనాయక్ తెలిపారు. బుధవారం పలు ఎస్సీ కాలనీల్లో ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీల కాలనీల్లో దాదాపు 50 మంది లబ్ధిదారుల వద్ద నుంచి వారి వివరాలను చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశాన్ని సజావుగా జరిపించండి

కురబలకోట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని సజావుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గంగయ్యకు ఎంపీటీసీలు వినతిపత్రం అందజేశారు. బుధవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశ నిర్వహణకు కోర్టు అనుమతులను పొందామని, ఎటువంటి ఆటంకాలు కలగకుండా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆటో-ద్విచక్రవాహనం ఢీ కొన్న ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. మదనపల్లె ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల కథనం మేరకు.. కలికిరి మండలం, మేడికుర్తికి చెందిన నాగరాజ కుమారుడు గురుమూర్తి (48) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరాడు. పుంగనూరు నుంచి వస్తున్న ఆటో నల్లగుట్టపల్లె వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.